
Licensed to post without Prepayment No. J/Nellore/003/15-17 R.N.I.No.25359/74 - PLG/NL/9-10/03
నెల్లూరు, 04.08.2017, శుక్రవారం సంపుటి : 37 సంచిక : 09 పేజీలు : 12, వెల : ₹ 5




# లాయర్

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి
www.lawyerteluguweekly.com



## బాబు చేతిలో... గ(రు)బ్బర్ సింగ్

* ఉద్దానంలో ఉద్ధరించిందేమీ లేదు
* ప్రజాసమస్యలపై పవన్‌ది పోరుబాట కాదు సీఎంకు వంతపాట

**ఏం మాయ చేసాడో, ఏం మత్తు చల్లాడోగాని చంద్రబాబుకు ఫిదా అయిపోయాడు పవర్‌స్టార్ పవన్‌కళ్యాణ్. ప్రజా సమస్యలపై ప్రశ్నిస్తానని చంద్రబాబు వద్దకు వెళతాడు. ఆయన ముఖం చూడగానే పవన్ ప్రశ్నలు మరచిపోతాడు. చంద్రబాబు చెప్పింది విని బయట కొస్తాడు. చంద్రబాబు లాంటి నాయకుడు ఈ భూమండలంలోనే లేడని పొగుడుతాడు.**

పవనిజమేంటో, ఆయన మేనరిజం ఏంటో అర్ధంకాక జనం జుట్టు పీక్కుంటున్నారు. మెగాస్టార్ చిరంజీవి ప్రజారాజ్యం పార్టీ పెట్టాడు. కనీసం ఒక ఎలక్షన్‌లోనన్నా ఒంటరిగా పోరాడి 19మంది ఎమ్మెల్యేలను గెలిపించుకున్నాడు. అధికారం లేకుండా పార్టీని నడపడం కష్టమని భావించి కాంగ్రెస్‌లో కలిసిపోయాడు. అప్పుడే చిరంజీవిని జనం వేళాకోలంగా చూసారు. అయితే ఇప్పుడు పవన్‌కళ్యాణ్ ఆ మాత్రం పోరాటం కూడా చేయడం లేదు. ఆయన మాటలకు చేతలకు పొంతనే

(మిగతా 10వ పేజీలో)

## నంద్యాలలో... యుద్ధవాతావరణం!



* తారాస్థాయికి చేరిన తెలుగుదేశం అధికార దుర్వినియోగం
* సర్వశక్తులొడ్డి పోరాడుతున్న ప్రతిపక్షం

**నంద్యాల...** *కేవలం ఒక అసెంబ్లీ నియోజకవర్గం మాత్రమే! ఈ నియోజకవర్గానికి ఈనెల 23వ తేదీ ఉపఎన్నిక జరగబోతోంది. ఒక అసెంబ్లీ ఎలక్షన్ కోసం ముఖ్యమంత్రి స్థాయి నాయకుడు ఒకరోజు ప్రచారం చేయొచ్చు. మహా అంటే రెండోరోజు ప్రచారం చేయొచ్చు. కాని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నంద్యాల ఉపఎన్నికల కోసం వారాల తరబడి అక్కడే తిష్ట వేస్తున్నాడు. సాధారణంగా సీఎంతో మాట్లాడాలంటే మంత్రులకే అపాయింట్‌మెంట్ కష్టం. అలాంటిది సీఎంగా చంద్రబాబు ఇక్కడ వీధి స్థాయి నాయకులతో కూడా మాట్లాడుకుంటున్నాడు.*

ఉపఎన్నికల పుణ్యమా అని నంద్యాలలో దాదాపు యుద్ధ వాతావరణం నెలకొంది. కాంగ్రెస్‌పార్టీ కూడా ఇక్కడ తమ అభ్యర్ధిని ప్రకటించినప్పటికి ప్రధాన పోటీ తెలుగుదేశం, వైయస్సార్ కాంగ్రెస్‌ల మధ్యే నెలకొని వుంది. పార్టీలతో పాటు అభ్యర్ధులు కూడా అన్ని విధాలా బల వంతులు కావడంతో పోరు రసవత్తరంగా మారింది. చంద్రబాబు అయితే మొత్తం పారిపాలననే పక్కనపెట్టేసాడు. తన మందీ మార్భలాన్నంతా నంద్యాలలోనే మోహరించాడు. నంద్యాల ఓటర్లను ఎన్నిరకాలుగా ప్రలోభపెట్టాలో అన్ని రకాలుగా ప్రలోభ పెడుతు న్నాడు. ఏవడిగితే అవి మంజూరు చేస్తున్నాడు. కులాల పరంగా ఓట్లు కొల్లగొట్టడానికి నానా తంటాలు పడుతున్నాడు. అధికార యంత్రాంగాన్ని ఎంతవరకు వాడుకోవాలో వాడుకుంటున్నాడు. కులాల వారీగా నాయకులను బరిలో దించాడు. పదిమందికి పైగా మంత్రులు ఎన్నికలను పర్యవేక్షిస్తున్నారు. వీళ్లకిక రెండో పని లేకుండా పోయింది. భూమా నాగిరెడ్డి మరణం

(మిగతా 10వ పేజీలో)



### ఆగస్టు 7న నెల్లూరులో మన వెంకయ్యకు ఆత్మీయ అభినందన

15 వేల మంది విద్యార్థినీ విద్యార్థులచే
15 వందల మీటర్ల జాతీయ జెండాతో
15 వ ఉపరాష్ట్రపతికి ఘన స్వాగత ఏర్పాట్లు

12లో




*జిల్లాలో బెట్టింగ్స్ కథ దాదాపు ఓ కొలిక్కి వచ్చింది. నిందితులను 3వతేదీ పోలీసులు తెరపైకి తెచ్చారు. బెట్టింగ్స్‌లో సూత్ర ధారులు, పాత్ర దారులైన బుకీలు, పంటర్ల వేట దాదాపు ముగిసినట్లే! హైదరాబాద్ లోని ఓ హోటల్‌లో ఈ కేసులో వున్న ప్రధాన వ్యక్తు లతో పాటు రాజకీయ నాయకులు కూడా పట్టుబడ్డారు.*

## దెబ్బకు ఠా... బెట్టింగ్ ముఠా

*క్రికెట్ బెట్టింగ్స్ కథ దాదాపు ముగిసినా, ఈ కేసు నుండి డిజిపి స్థాయిలో ఒత్తిళ్లు తెచ్చి మంత్రి ప్రధాన అనుచరుడిని తప్పించడమే కేసు మొత్తానికి పెద్ద మైనస్ కానుంది. క్రికెట్ బెట్టింగ్స్ భాగోతం 'ఖాకీ' డిపార్ట్‌మెంట్‌కు కూడా చుట్టుకోవడం తెలిసిందే! ఈ కేసుకు సంబంధించి నెల్లూరు నగర, గూడూరు డిఎస్పీలను విఆర్‌కు ఆదేశించారు. అలాగే ఇంకొందరు సి.ఐలపైనా వేటుపడే అవకాశముంది.*

(మిగతా 10వ పేజీలో)



# సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణే ఇస్కాన్ ధ్యేయం

## - డాక్టర్ సుఖదేవస్వామి



బాల్యం నుంచి భక్తి, సంస్కృతి, సంప్రదాయాలను పెంపొందించేందుకు ఇస్కాన్ (అంతర్జాతీయ శ్రీకృష్ణ చైతన్య సంఘం) ఆధ్వర్యంలో వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు ఇస్కాన్ అధ్యక్షుడు డాక్టర్ సుఖదేవస్వామి తెలిపారు. ఆగస్టు 15న శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను పురస్కరించుకుని గత నెల 30న ఇస్కాన్ మందిరంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ బాల్యం నుంచి భగవంతుని చింతన కలిగించాలన్న సంకల్పంతో చిన్నారులకు జూనియర్, సీనియర్ విభాగాల్లో ఫ్యాన్సీడ్రస్, పెయింటింగ్, స్టోరీ టెల్లింగ్ (శ్రీకృష్ణ భగవానుని కథలు), శ్లోక ఉచ్చారణ, భక్తిగీతాలు, వెన్న కుండలను అందంగా అలంకరించడం, చిన్ని కృష్ణుని ఊయల తయారీ పోటీలను నిర్వహించామన్నారు. పోటీతత్వంతో ప్రతిభ వెలుగులోకి వస్తుందన్నారు. ఉదయం జరిగిన పోటీల ప్రారంభోత్సవ కార్యక్రమానికి కలెక్టర్ సతీమణి సింధూర, ప్రముఖ వైద్యులు యశోధర, సాయంత్రం జరిగిన కార్యక్రమానికి ప్రముఖదాత వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. ఏడు విభాగాల్లో మొదటి మూడు స్థానాల్లో నిలచిన వారికి శ్రీకృష్ణ జన్మాష్టమి నాడు బహుమతి ప్రదానం జరుగుతుందన్నారు. ఆగస్టు 3 నుంచి 7వ తేదీ వరకు శ్రీరాధాకృష్ణుల ఊంజల్ సేవలు, ఆగస్టు 7న బలరామ జయంతి కార్యక్రమాలు జరుగనున్నాయన్నారు.







# బాధ్యతగా పని చేస్తా!

## నుడా ఛైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి

విద్యార్థులను ఉత్తమపౌరులుగా తీర్చిదిద్దే పాఠశాలల యాజమాన్యాలకు అన్నివేళలా అండగా వుంటానని, వారి సమస్యల పరిష్కారానికి తనవంతు సహకారమందిస్తానని నుడా ఛైర్మెన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి పేర్కొన్నారు. సోమవారం నెల్లూరు టౌన్‌హాల్లోని రేబాల లక్ష్మీనరసారెడ్డి స్మారక భవనం ఏసి హాలులో నుడా ఛైర్మెన్‌గా పదవీ బాధ్యతలు చేపట్టిన కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డిని ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ (అపస్మా) ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అపస్మా చేసిన ఈ సన్మానం బాధ్యతను మరింతగా గుర్తుచేస్తోందన్నారు. నెల్లూరు నగరంలోని ప్రధాన సమస్యలైన ట్రాఫిక్ ఇబ్బందులను తీర్చేందుకు ప్రత్యేకంగా రెండు ఫ్లైఓవర్ బ్రిడ్జిలను నిర్మించాల్సిన అవసరం వుందన్నారు. మాస్టర్‌ప్లాన్ ప్రకారం రైల్వేలైన్ పక్కన నివసించే వారికి ప్రత్యామ్నాయ ఏర్పాటు చేసి, ఆక్రమణలను తొలగించి రోడ్డు నిర్మాణాన్ని మేయర్‌తో కలిసి చేపడతామన్నారు. ఐల్యాండ్‌లను కుదించి ట్రాఫిక్ ఇబ్బందులను తొలగించడంపైనా దృష్టి సారిస్తామన్నారు. ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ నాయకులు మైథిలి మనోహర్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, ఎం.వి.సుబ్బారెడ్డి, వాకాటి విజయకుమార్‌రెడ్డి, వెంకట్రామయ్య, శౌరెడ్డి పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో పలు ప్రైవేట్ స్కూల్స్ అధినేతలు శ్రీనివాసులురెడ్డిని శాలువాలతో సత్కరించారు.

# కిక్ బాక్సింగ్‌లో మెరిసిన 'రత్నాలు'



విశాఖపట్టణంలో జులై29, 30 తేదీల్లో జరిగిన రాష్ట్రస్థాయి కిక్ బాక్సింగ్ టోర్నమెంట్‌లో డా॥ కిషోర్స్‌రత్నం మోడల్ స్కూల్, కృష్ణదేవరాయ స్కూల్స్‌కు చెందిన విద్యార్థులు ఎస్.వర్షిత (5వ తరగతి), జి.గంగా తరుణ్ (4వ తరగతి) పాల్గొని విజయం సాధించారు. బాలికల విభాగంలో రత్నం మోడల్ స్కూల్‌కు చెందిన ఎస్.వర్షిత(5వ తరగతి) గోల్డ్‌మెడల్‌ను సాధించగా, శ్రీకృష్ణదేవరాయ హైస్కూల్‌కు చెందిన జి.గంగాతరుణ్ బాలుర విభాగంలో గోల్డ్‌మెడల్‌ను సాధించారు. వీరిని రత్నం పాఠశాలల జనరల్ మేనేజర్ రామ్మూర్తినాయుడు అభినందించి, మా స్కూల్ విద్యార్థులు ఏ రంగంలోనైనా రాణించగలిగిన ధీశాలురని అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్స్ విజయ, ప్రపూర్ణ, రామచంద్రయ్య, మేనేజర్ విజయచంద్ర పాల్గొన్నారు.

# పనబాకకి బెస్ట్ థీసిస్ అవార్డ్




కేంద్ర మాజీమంత్రి డాక్టర్ పనబాక లక్ష్మికి వైజాగ్ ఆంధ్ర యూనివర్శిటీ గత నెల 29న బెస్ట్ థీసిస్ అవార్డును ప్రదానం చేసింది. పనబాక లక్ష్మి పొలిటికల్ సైన్స్ అండ్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ ఫ్యాకల్టీ ఆఫ్ ఆర్ట్స్-2014లో పరిశోధన చేసి సమగ్రమైన వ్యాసాన్ని సమర్పించినందుకుగాను ఆమెకు వైజాగ్ ఆంధ్ర యూనివర్సిటి ప్రొఫెసర్ వల్లభనేని రమాకృష్ణరావు చేతులమీదుగా డాక్టరేట్ అందుకున్నారని డిసిసి అధ్యక్షుడు పనబాక కృష్ణయ్య తెలిపారు. ఈ సందర్భంగా పనబాక లక్ష్మికి నెల్లూరు నగర ప్రముఖులు, కాంగ్రెస్‌పార్టీ నాయకులు, అభిమానులు ప్రత్యేక అభినందనలు తెలియజేశారు.


ఆహ్వానము

మన వెంకయ్యకు

ఆత్మీయ అభినందన



భారతదేశ 15వ ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా ఎన్నికైన సందర్భంగా

తెలుగుజాతి గర్వించే మన నెల్లూరు ముద్దుబిడ్డ

శ్రీ ముప్పవరపు వెంకయ్యనాయుడు గారికి

యువతరం, మన తరంచే సముచిత సత్కారం.

తేది: 07.08.2017, సోమవారం

సమయం: సాయంత్రం 4 గంటలకు

వేదిక: వి.ఆర్.కళాశాల మైదానం, నెల్లూరు.

అందరికీ ఇదే మా ఆహ్వానం.

ఆహ్వాన కమిటీ:

వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ॥ సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ॥ పొంగూరు నారాయణ ॥ కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ॥ కె.వి.రత్నం


నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి ॥ నెల్లూరు డోలేంద్రప్రసాద్ ॥ బి.మనోహర్‌రెడ్డి ॥ తుంగా శివప్రభాత్‌రెడ్డి ॥ పి.చంద్రశేఖర్‌రెడ్డి

RSVP: 94404 25225

94402 69009, 98490 48055






ఉపాపతి నుండి.. ఉపరాష్ట్రపతి వరకు...!
విద్యార్థి నాయకుడి నుండి పార్టీ అధ్యక్షుని వరకు...!!
శాసనసభ్యుడి నుండి కేంద్రమంత్రి వరకు...!!!
పల్లెటూరు నుంచి పార్లమెంట్ వరకు,
ఉద్యమాలే ఊపిరిగా, ప్రజాసేవే పరమావధిగా,
జనంకోసం ప్రతిక్షణం
పార్టీ, ప్రజాజీవితానికే జీవితం సమర్పణం చేసిన
తెలుగు తేజం, సింహపురి ముద్దుబిడ్డ
శ్రీ ఎం. వెంకయ్య నాయుడు గారు
ద్వితీయ అత్యున్నత పదవికి ఎన్నికై మొట్టమొదటి సారిగా
జన్మభూమి నెల్లూరుకు విచ్చేస్తున్న సందర్భంగా
ఆత్మీయ స్వాగతం
ఆత్మీయ అభినందన
7 ఆగష్టు, 2017 , సా॥ 4 గం॥లకు
వి.ఆర్.సి. గ్రౌండ్స్, నెల్లూరు.
N. చంద్రశేఖర్ రాజు - Sd. షాజహాన్
P.V. రాఘవరెడ్డి - శేఖర్ కల్వం
Harsha Ads - 9849188889

## 'ప్రభా'తం

# వ్యాపారంపై జిఎస్‌టి పోటు

**జీఎస్టీ వచ్చి నెలరోజులు గడిచినా అదింకా బాలారిష్టాల దశలోనే ఉంది. చరిత్రాత్మకమైన ఈ పన్నుల సంస్కరణ అమలు లో సమస్యలు ఎదురుకావడం సహజమే. ఒక్క నెలలోనే దేశవ్యాప్తంగా ఇది అమలు కావాలన్నా కష్టమే. అయితే, జిఎస్టీ ప్రయోజనాలు వినియోగదారులకు చేరకుండా చేస్తున్న అంశాలన్నిటినీ వెంటనే కేంద్రం గుర్తించి పరిష్కరించాల్సివుంది. ముఖ్యంగా జీఎస్టీ వినియోగం పట్ల వ్యాపారవర్గాల్లో మంచి అవగాహన కలిగించాలి. అప్పుడే, దీని అమలుకు మార్గం సుగమమవుతుంది.**

మన దేశంలో అన్నీ సమస్యలే. సమస్యలు తీర్చేందుకు ప్రయత్నాలు చేస్తున్నా.. దానిలోనూ సమస్యలే. చెప్పేది మంచిదే అయినా దానిని ఆచరణలోకి తేవడానికి తలప్రాణం తోకకి వస్తుంటుంది. ఏదీ ఒక పట్టాన తెగదు. ఒకటి పోయిందనుకుంటే మరో సమస్య నేనున్నానంటూ ముందుకు వస్తుంటుంది. అయినా, దేశవ్యాప్తంగా ఒకే విధానం అమలు చేయాలంటే అంత సులభమైన పనేమీ కాదు. ఎంతో ప్రయాసపడితే తప్ప అది ఒక కొలిక్కి రాదు. ఈ లోగా లేనిపోని సమస్యలు ఆవరించి, మొత్తంగా సమస్యను మరింత జటిలం చేస్తుంటాయి. ఇప్పుడు జీఎస్టీ విషయంలోనూ జరుగుతున్నదిదే. అందులోనూ వ్యాపారరంగం, పన్నుల విధానమంటేనే తేనెతుట్టెను కదిలించినట్లు లెక్క. దేశవ్యాప్తంగా ఒకే పన్ను విధానం ఉండాలని అనుకోవడం ఎంత శ్రేయోదాయకమైన విషయమో అది క్రమేణా ఆచరణలోకి పూర్తిస్థాయిలో వస్తే తప్ప తెలియదు. పన్నులు ఎగ్గొట్టడం, అతి తక్కువ పన్నులు చెల్లించడం వంటి వ్యవహారాలకు అంటకత్తెర వేస్తూ, పన్నుల విధానాన్ని సక్రమమైన రీతిలో క్రమబద్ధం ఉచేస్తూ..వినియోగదారుడి శ్రేయస్సే పరమావధిగా రూపొందించిన జిఎస్టీ వచ్చి నెల గడిచినా పూర్తిస్థాయిలో అమలులోకి రాకపోవడం విమర్శలకు గురవుతుండడం సహజమే. కేవలం నెలకో రెండునెలలకో అత్యంత క్లిష్టతరమైన పన్నుల వ్యవస్థ దేశవ్యాప్తంగా ఒక కొలిక్కిరావాలంటే ఎంత కష్టమో, ఎంత సమయం పడుతుందో విజ్ఞులందరికీ తెలిసిన విషయమే. అయితే, ఈ విషయంలో వస్తున్న విమర్శలను కూడా కాదనలేం. వస్తుసేవల పన్ను (జీఎస్టీ) విధానం అమల్లోకి వచ్చి నెలరోజులు గడిచినా అదింకా బాలారిష్టాల్లోనే ఉండడమే దీనికి కారణం. జీఎస్టీ అమలులో లెక్కలేనన్ని సమస్యల సవాళ్ళు చుట్టుముడుతున్నాయి. దీని అమలుకు సంబంధించి సాఫ్ట్‌వేర్ నెట్‌వర్కింగ్ వ్యవస్థ, గూడ్స్ అండ్ సర్వీస్ ట్యాక్స్ నెట్‌వర్-జీఎస్టీఎన్ వంటివి నేటికీ పూర్తిస్థాయిలో సిద్ధం కాకపోవడంతో సర్వత్రా వ్యాపారులు తీవ్రమైన సమస్యలనే ఎదుర్కొంటున్నారు. నెలరోజులైనా వారికి జిఎస్టీపై సమగ్రమైన అవగాహన కలిగించకపోవడం పెద్ద లోపంగా చెప్పుకోవచ్చు. ఏ వస్తువుపై పన్ను ఎంత పడుతుంది?.. ఇన్‌వాయిస్‌లు ఎలా అప్‌లోడ్ చేయాలి తదితర ప్రాథమిక సమస్యల పట్ల ట్రేడర్లకు సరైన అవగాహన కల్పించే నాథులు ఉండడం లేదు. దీంతో అంతా అయోమయం.. గందరగోళం అన్నట్లుగా తయారైంది పరిస్థితి. జీఎస్టీకి సంబంధించి వచ్చే సమస్యల పరిష్కారం కోసం హెల్ప్‌డెస్క్‌ను ఏర్పాటుచేసి, అందులో మూడువందల మంది సిబ్బందిని ఏర్పాటుచేసినా నిత్యం దేశవ్యాప్తంగా వేలాదిగా వస్తున్న ఫిర్యాదులను పరిష్కరించడం ఎలా సాధ్యమవుతుంది?..అందుకు సిబ్బంది సంఖ్యను పెంచడమే కాక, ఆయా రాష్ట్రాల్లో అవగాహన కేంద్రాలను భారీఎత్తున ఏర్పాటు చేయాల్సి ఉంది. ఆ పని నేటికీ చేయకపోవడం వల్లనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కేంద్రప్రభుత్వం ఒకవైపు నిర్దేశిత లక్ష్యాలను, నియమనిబంధనలను స్పష్టం చేస్తున్నా, జిఎస్‌టి అమలులో వచ్చే ఇబ్బందులను అధిగమించాలంటే ఏమి చేయాలో తెలియక అత్యధికశాతం వ్యాపారవర్గాలు ఆందోళనలోనే ఉన్నాయి. ఒకవేళ ఏమి చేస్తే, భవిష్యత్తులో ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోవాల్సి ఉంటుందోననే భయాందోళనలు చాలామందిలో ఉన్నాయి. ఈ సంకట పరిస్థితులతో ఆయా రాష్ట్రాల్లో కూడా వ్యాపారాలు బాగా మందగిస్తున్నాయి. జీఎస్టీ అమల్లోకి వచ్చాక వ్యాపార లావాదేవీల్లో 25 నుంచి 30 శాతం దాకా తగ్గుదల కనిపిస్తున్నట్లు అధికారుల అంచనా. అంతేకాదు, వస్తువులపై పాత గరిష్ట చిల్లర ధర, కొత్త ధర ముద్రించాల్సి ఉన్నా అదీ సక్రమంగా అమలులోకి రావడం లేదు. జీఎస్టీ వస్తే ప్రభుత్వ ఖజానాకు ఢోకా లేకపోయినా, జీఎస్టీ వస్తే సామాన్య జనులకు ఎంతో మేలని, అనేక వస్తువులు, ముఖ్యంగా నిత్యావసర వస్తువుల ధరలు తగ్గిపోయి సామాన్యుల జీవనం గతంలో కంటే మెరుగవుతుందని అందరూ భావించారు. ముఖ్యంగా పాలు, పండ్లు, ఆహారధాన్యాలు, మందుల ధరలు తగ్గుతాయని అనుకున్నారు. కానీ, వాస్తవానికి వస్తే అలాంటిదేమీ కన్పించకపోగా జీఎస్టీ దెబ్బకు ధరలు ఊహించనంతగా పెరిగపోతుండడం సామాన్యులు, మధ్యతరగతి ప్రజలను ఆవేదనకు గురిచేస్తోంది. ఇటీవల భారీగా పెరిగి బెంబేలెత్తిస్తున్న కూరగాయలు, పండ్లు, ఆహార వస్తువులు, తదితర నిత్యావసర వస్తువుల ధరలు చూసి ప్రజలు గుండెలు గుభేల్‌మంటున్నాయి. సరుకులు కొనలేక సామాన్యులు బెంబేలు..కొనడం లేదని వ్యాపారుల గగ్గోలు...ఇదీ పరిస్థితి. ధరలు పెరగడానికి, తరగడానికి కారణాలు అనేకం ఉండవచ్చు. కానీ సామాన్యులు నిత్యం పడుతున్న ఆర్థికబాధలు నానాటికీ పెరుగుతున్న సామాన్య, మధ్యతరగతి ప్రజల జీవనవ్యయం వారిని కుంగదీస్తోంది. ఈ విషయాలన్నీ నేరుగా క్షేత్రస్థాయిలోకి వెళ్ళి పరిశీలించే అధికారులు లేకపోవడమే పెద్ద లోపం. ఈ సమస్య లన్నిటినీ పూర్తిస్థాయిలో విశ్లేషించి సరైన దిశలో పరిష్కరించాలి. దేశవ్యాప్తంగా ఒకే వస్తువుకు ఒకే ధర ఉండాలన్న సంకల్పం దేశానికి ఎంతో శుభపరిణామం. చరిత్రాత్మకమైన రీతిలో జీఎస్టీ వంటి పన్నుల సంస్కరణలు తీసుకురావడం ఎంతైనా ఆహ్వానించదగ్గదే. ఎంతో సాహసంతో దీనిని ప్రవేశపెట్టినందుకు ప్రత్యేకించి ప్రధాని మోడీని, కేంద్ర- రాష్ట్రాల పాలకులను అభినందించక తప్పదు. అయితే, క్షేత్రస్థాయిలో సమస్యలు పెల్లుబికి, వాటి ఫలితాలు తారుమారవుతుండడాన్ని గుర్తించాల్సి ఉంటుంది.

ఇకనైనా జిఎస్టీ ప్రయోజనాలు వినియోగదారులకు చేరకుండా చేస్తున్న అంశాలను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే గుర్తించి ఆయా సమస్యలను పరిష్కరించాల్సివుంది. ముందుగా జీఎస్టీ వినియోగం పట్ల వ్యాపారవర్గాల్లో మంచి అవగాహన కలిగించేందుకు కేంద్రం కృషి చేయాల్సివుంది. మొత్తంగా, జీఎస్టీ అమలులో తలెత్తుతున్న అన్నిరకాల సమస్యలను త్వరితగతిన పరిష్కరించి..జీఎస్టీ ఫలితాల ఫలాలు అందరికీ చేరువయ్యేలా చూడాల్సివుంది. అందుకు, త్వరలోనే ఈ సమస్యలనుంచి..బాలారిష్టాల నుంచి జీఎస్టీ గట్టెక్కాల్సిఉంది. అప్పుడే జిఎస్‌టి ప్రయోజనం నెరవేరుతుంది.

# భూముల రికార్డులు సమగ్రంగా ఉండాలి

**- జేసీ ఏఎండి ఇంతియాజ్**



జిల్లాలోని 46 మండలాల్లో ఉన్న సిబ్బంది భూముల రికార్డులు నమోదు పద్ధతులు పూర్తిగా అవగాహన చేసుకుని ఆ రికార్డులను సమగ్రంగా రూపొందించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఏఎండి ఇంతియాజ్ అన్నారు. భూముల రికార్డుల నవీకరణలో భాగంగా గతనెల 29న జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జేసి ఎఎండి ఇంతియాజ్ ఆధ్వర్యంలో రెవిన్యూ సిబ్బందికి శిక్షణా కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ, ఆ రికార్డులను కంప్యూటర్లలో నమోదు చేసేటప్పుడు ఏమాత్రం నిర్లక్ష్యం వహించినా భవిష్యత్తులో ఇబ్బందులు ఎదురవుతాయని, రెవిన్యూ సిబ్బంది అత్యంత జాగ్రత్తగా ఈ రికార్డులను తయారుచేయాలన్నారు. రికార్డుల తయారీ సమగ్రంగా ఉండడానికి మండలానికి ఒకరు చొప్పున 46మందికి తగు శిక్షణ ఇస్తున్నామని తెలిపారు.

# 'కథారచన' శిక్షణాశిబిరంలో నెల్లూరు రచయితలు



ఆంధ్రప్రదేశ్ రచయితల సంఘం అధ్యక్ష కార్యదర్శులు సోమేపల్లి వెంకటసుబ్బయ్య, చలపాక ప్రకాష్, గౌరవాధ్యక్షులు బి.హనుమారెడ్డి, కోశాధికారి కలిమిశ్రీల ఆధ్వర్యంలో గుంటూరులో జరిగిన కథారచనకు సంబంధించి ఒక్కరోజు జరిగిన రాష్ట్రస్థాయి శిక్షణా శిబిరంలో నెల్లూరు రచయితలు కూడా పాల్గొన్నారు. ప్రసిద్ధ కథారచయితలు విహారి, వేదగిరి రాంబాబు, పి.చంద్రశేఖర అజాద్, పాపినేని శివశంకర్, మధురాంతకం నరేంద్ర, సి.భవానీదేవి, కాటూరు రవీంద్ర త్రివిక్రమ్ తదితరులు పాల్గొని కథారచనలో మెళకువలు తెలియజేశారు.

ఈ శిబిరంలో నెల్లూరుజిల్లా నుంచి పెన్నా రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి గుండాల నరేంద్రబాబు, ముత్యాల రవిచంద్ర పాల్గొని జ్ఞాపిక, ప్రశంసాపత్రాలను అందుకున్నారు.




# దిగజారుతున్న ముఖ్యమంత్రి

నంద్యాల ఉపఎన్నికల్లో గెలవాలని చెప్పి ముఖ్యమంత్రి చంద్రబాబు తొక్కుతున్న అడ్డదారులు చూస్తుంటే అసలు ప్రజాస్వామ్యం బ్రతికుందా? అన్న అనుమానమొస్తుంది. ముఖ్యమంత్రిగా ఆ పదవికి వున్న విలువనే దిగజారుస్తున్నాడు. ఓట్ల కోసం బెదిరింపులకు కూడా దిగుతున్నాడు. వందలకోట్ల నిధులిస్తామని బూటకపు వాగ్దానాలు చేస్తున్నాడు. ముఖ్యమంత్రిగా ఈ మూడేళ్లలో రాష్ట్రాభివృద్ధికి చంద్రబాబు చేసిందేమీ లేదు. అలాంటి వ్యక్తి ఈ రెండేళ్లలో ఏదో చేస్తానని చెబితే నమ్మి ఓట్లేస్తారా? నంద్యాల ప్రజలు ఆలోచించుకోవాలి.

**ఎస్.కె.నాగూర్, బద్వేల్.**

# తెలుగు భాష అదృశ్యమేనా?

తెలుగు రాష్ట్రాలలో తెలుగు భాష త్వరలో అదృశ్యమైనా ఆశ్చర్యం లేదు. మంత్రి నారాయణ ప్రతి మీటింగ్‌లోనూ ఇంగ్లీష్ ఆవశ్యకతను నొక్కి చెబుతుంటారు. చంద్రబాబు తెలుగు ఊసే ఎత్తకుండా ఇంగ్లీష్‌కు మద్దతు పలుకుతుంటాడు. హేతు దళితవాది కంచె ఐలయ్య మాతృభాష వలన దళితులకు ప్రపంచజ్ఞానము మందగిస్తుందని అంటున్నారు. గిడుగు వాడుక భాష ఏమైంది. తెలుగు భాషోద్యమాలు ఏమయ్యాయి. మండలి బుద్ధప్రసాద్ ఎక్కడ నిద్రపోతున్నారు? వావిలాల ఆత్మ ఎక్కడ ఘోషిస్తుందో? సినారె, విశ్వనాథం, కృష్ణదేవరాయల భాషాపోషణను గుర్తుకుతెచ్చుకుని తెలుగును బ్రతికించుకుందాం. ప్రభుత్వ కార్యాలయాలలో, ప్రైవేట్ సంస్థలలో తెలుగులోనే వ్యవహారాలు నడిపేలా చేయాలి. గ్రామ సచివాలయం నుండి రాష్ట్ర సచివాలయం వరకు పరిపాలనా వ్యవహారాలలో తెలుగుకే ప్రాధాన్యతనివ్వాలి.

**వాస్తు రామచంద్ర, నెల్లూరు.**

# ఎస్పీకి అభినందనలు

జిల్లాలో వేళ్లూనుకుని వున్న బెట్టింగ్స్ రాకెట్‌ను అంతమొందించడానికి ఎస్పీ రామకృష్ణ తీసుకుంటున్న చర్యలు ఎంతైనా అభినందనీయం. ఈ బెట్టింగ్స్ రాకెట్ చాపక్రింద నీరులా జిల్లా అంతటా వ్యాపించి వుంది. మద్యం మహమ్మారిలాగే బెట్టింగ్స్ వల్ల కూడా కుటుంబాలకు కుటుంబాలే నాశనమవుతున్నాయి. బెట్టింగ్స్ మాయలో పడి కొందరు ఉద్యోగాలు పోగొట్టుకున్నారు. కొందరు వ్యాపారాలు దివాలా తీసి దొంగలుగా మారారు. జిల్లాలో బెట్టింగ్స్ ముఠాలను అరికడితే చాలా కుటుంబాల వాళ్లు ఎస్పీకి ఋణపడి వుంటారు.

**కె.సుశీల రాం, నెల్లూరు.**

# కాంట్రాక్ట్ ఉద్యోగులకు అన్యాయం

చంద్రబాబు ప్రభుత్వంలో కాంట్రాక్ట్ ఉద్యోగులకు తీవ్ర అన్యాయం జరుగుతోంది. గతంలో జి.ఓ.ఎం.ఎస్ నెం. 151 ద్వారా కాంట్రాక్ట్ ఉద్యోగులలో జూనియర్ అసిస్టెంట్, టైపిస్ట్‌లకు 15వేల జీతం వచ్చేది. ఇప్పుడు జి.ఓ ఎం.ఎస్ నెం.95తో జూనియర్ అసిస్టెంట్‌కు, అటెండర్‌కు ఒకే జీతం 12 వేలుగా నిర్ణయించారు. అంటే డిగ్రీ చదివిన వారిని, 6వ తరగతి వాళ్లను ఒకే స్కేల్‌లో పెట్టారు. కాంట్రాక్టు ఉద్యోగుల సమస్యలపట్ల అవగాహన లేకుండా అడ్డగోలు జి.ఓలతో మా కడుపుకొడుతున్నారు. 13వ ఆర్థిక సంఘం ద్వారా కాంట్రాక్ట్ టైపిస్ట్‌లు, జూనియర్ అసిస్టెంట్‌ల జీతాలు పెంచే విషయమై మా తరపున అసెంబ్లీలో పోరాడాలని నెల్లూరు గ్రామీణ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డికి విజ్ఞప్తి చేస్తున్నాము.

**మహేష్.ఎస్, నెల్లూరురూరల్.**



# ఉంటారా? వెళ్ళిపోతారా?



***రాజకీయాలు చాలా విచిత్రంగా ఉంటాయి. ఎప్పుడు ఎవరు కింగ్‌లవుతారో, ఎవరు తెరమరుగవుతారో అంతే పట్టదు. రాజకీయాలలో ఎల్లకాలం వెలగడం అన్నది ఎవరికీ శాశ్వతం కాదని చాలామంది నాయకుల చరిత్రను పరిశీలిస్తే అర్ధమవుతుంది.***


నెల్లూరుజిల్లాలో సుధీర్ఘ రాజకీయ చరిత్ర ఉండేది ఆనం కుటుంబానికే! 60ఏళ్ల రాజకీయ చరిత్ర వున్న కుటుంబమది. ఏ పార్టీలో వున్నా జిల్లా అగ్ర నేతలుగా చక్రం తిప్పుతూ వచ్చారు. అధికారంలో వున్నా ప్రతిపక్షంలో వున్నా జిల్లా రాజకీయాలకు ఏ.సి సెంటర్ కేంద్రబిందువుగా వుండేది. అలాంటి సెంటర్ మూడేళ్లుగా కళా విహీనంగా మారింది. అక్కడ రాజకీయ సందడే కనిపించడం లేదు. ఇది రాష్ట్ర రాజకీయాలలో వచ్చిన మార్పు ఫలితమా? లేక ఆనం సోదరుల స్వయంకృతాపరాధమా?

2009 సెప్టెంబర్ 2వ తేదీన హెలికాప్టర్ ప్రమాదంలో వై.యస్.రాజశేఖరరెడ్డి మరణించకపోయి వున్నా, 2014లో రాష్ట్ర విభజన జరగకపోయి వున్నా ఆనం బ్రదర్స్ రాజకీయ భవిష్యత్‌లో పెద్ద మార్పు లుండేవి కావు. ఈ రెండు సంఘటనలు వారి రాజకీయ ప్రయాణాన్ని వూహించని మలుపులు తిప్పాయి. వై.యస్. మరణం తర్వాత జగన్ వైయస్సార్ కాంగ్రెస్‌ను స్థాపించడం, జగన్ మీద కోపంతో సోనియాగాంధీ రాష్ట్ర విభజనకు పూనుకోవడం తెలిసిందే! ఈ పరిణామం నేపథ్యంలో రాష్ట్రంలో కాంగ్రెస్ పతనావస్థకి చేరుకుంది. రాష్ట్రంలోని ప్రధాన కాంగ్రెస్ నాయకులందరు కూడా అటు తెలుగుదేశం లోకో, ఇటు వైకాపాలోకో... రాజకీయ సురక్షిత కేంద్రాల్లోకి వెళ్లిపోయారు. ఆనం రామనారాయణ రెడ్డి మాత్రం ఎలక్షన్‌కు మూడు నెలల ముందైనా ముఖ్యమంత్రి పీఠం అప్పగించకపోతారా అనే ఉద్దేశ్యంతో కాంగ్రెస్‌లోనే ఉండిపోయాడు. ఆయనతో పాటు ఆయన అన్న వివేకా కూడా కాంగ్రెస్‌లోనే వుండిపోవాల్సి వచ్చింది. 2014 ఎన్నికలప్పుడు ఆనం సోదరులను తెలుగుదేశంలో చేరమని చంద్రబాబే స్వయంగా పిలిచాడు. ఆత్మకూరు, నెల్లూరు సీట్లతో పాటు మంత్రి పదవి కూడా ఇస్తానని హామీ ఇచ్చాడు. నెల్లూరు ఎంపీ అభ్యర్థి ఆదాల ప్రభాకర్‌రెడ్డి కూడా వారి కోసం ప్రయత్నించాడు. ఆనం ఆత్మకూరు తెలుగుదేశం అభ్యర్థి అయ్యుంటే, ఆదాల ఎంపీగా గెలిచివుండేవాడు. కాని, ఆరోజు వాళ్లు కాంగ్రెస్‌ను వీడలేదు. ఎన్నికలకు ముందే వాళ్లు తెలుగుదేశంలో చేరుంటే ఈరోజు జిల్లా పార్టీలో వారు ఆడిందే ఆట పాడిందే పాటగా వుండేది. కాని, ఎన్నికల తర్వాత తెలుగుదేశంలో చేరిన దానివల్ల వాళ్ళ మాటలు పడాల్సివస్తోంది. ఆ పార్టీలో వున్న సీనియర్ నాయకుల ముందు వీళ్లు చిన్న నాయకులైపోయారు. పార్టీలో వీరికి విలువ తగ్గిపోయింది. ఒకప్పుడు వాళ్ల ముందు చేతులు కట్టుకుని నిల్చున్న నాయకులు కూడా ఇప్పుడు వాళ్లను లెక్కచేయడం లేదు. తెలుగుదేశంలో చేరాక రాజకీయంగా వారి పరిస్థితి దిగజారింది. కనీసం పార్టీ కార్యక్రమాలకు కూడా వాళ్లను పిలవడం లేదు. పార్టీలో చేర్చుకునేటప్పుడు చంద్రబాబు వారికిచ్చిన హామీలు నెరవేర్చలేదు. ఆనం రామనారాయణరెడ్డికి ఆత్మకూరు ఇన్‌ఛార్జ్ ఇచ్చారు. కాని, పక్కనే కన్నబాబు అనే బల్లేన్ని కూడా వుంచారు. ఇటీవల ఆనం కన్నీళ్లు తుడవడానికన్నట్లు ఆనం రంగమయూర్‌రెడ్డిని జిల్లా తెలుగు యువత అధ్యక్షుడుగా చేసారు. అయితే వివేకాకు ఎమ్మెల్సీ రాలేదని ఆవేశంతో రగిలిపోతున్న ఆనం కుటుంబం ఆ పదవి తీసుకోలేదు. ఆనంబ్రదర్స్ ఇప్పుడు తెలుగుదేశంపై పూర్తిస్థాయి అసంతృప్తితో రగిలిపోతున్నారు. ఈ దశలో వాళ్లు తెలుగుదేశాన్ని వీడుతారా? లేక అవమానాలను దిగమింగుకుని కొనసాగుతారా? అన్నది పెద్దప్రశ్న?

తెలుగుదేశాన్ని వీడితే రాష్ట్రంలో వున్న మరో రాజకీయ ప్రత్యామ్నాయం వైసిపినే! బీజేపీ, కాంగ్రెస్‌లు ఇప్పట్లో రాష్ట్రంలో బలమైన శక్తులుగా ఎదిగే అవకాశం లేదు. మరి వైసిపిలోకి వెళ్లడానికి గల అవకాశాలకు వీళ్లే గండికొట్టుకున్నారు. కాంగ్రెస్‌లో వున్నప్పుడు రెండు తెలుగు రాష్ట్రాల్లో ఏ పార్టీ నాయకులూ నోరు పారేసుకోనంతగా ఆనం వివేకా, రామనారాయణలే జగన్‌పై నోరు పారేసుకున్నారు. ఎవరి మెప్పుకోసమో తమ స్థాయికి దిగజారి తమ నోటితో అనరాని మాటలన్నారు. వీళ్ల మాటలను వైసిపి నాయకులే కాదు, చివరకు తెలుగుదేశం నాయకులు కూడా అసహ్యించుకున్నారు. పోనీ తెలుగుదేశంలో చేరకన్నా కుదురుగా, నోరు విప్పకుండా వుండుంటే జగన్‌కు వీరికి మధ్య ఒక సానుకూల వాతావరణ మన్నా వుండేది. గతంలో చేసిన విమర్శలు మరుగున పడి వైకాపాలో చేరడానికి మార్గం ఏర్పడేది. కాని, కొంతకాలం క్రితం అమరావతిలో చంద్రబాబును కలిసాక జగన్‌పై వివేకా చేసిన పచ్చిబూతు విమర్శలతో వైకాపా తలుపులను శాశ్వతంగా మూసేలా చేసింది. ఈరోజు ఆనం సోదరులను వైసిపిలో చేర్చుకుంటామన్నా, ఆ పార్టీలోని మిగతా నాయకులు అంగీకరించే పరిస్థితి లేకుండాపోయింది.

రాజకీయంగా ఆనం బ్రదర్స్‌కు గడ్డుకాలం కొనసాగుతోంది. ఉన్న పార్టీలో ఇమడలేకపోతున్నారు. అవతలి పార్టీ వాళ్ళు రమ్మనడం లేదు. వారి భవిష్యత్ రాజకీయ ప్రయాణం ఇక ఏ మలుపు తిరుగుతుందో చూడాలి!

## 'పసుపు' కేసులో...
# మలుపులెన్నో



***వ్యవసాయ మంత్రి ఉదయగిరి ప్రాంత పర్యటనకు వెళ్లాడు... ఆ ప్రాంతపు పసుపు రైతులు మంత్రి వద్దకు వచ్చారు. పసుపు పండించామని, గిట్టుబాటు ధర లేదని మొరపెట్టుకున్నారు. రైతన్న కంట నీరు పెట్టినా, కడుపు మండి తన బాధను చెప్పుకున్నా స్పందించకపోతే వాళ్ళు ప్రజాప్రతినిధులే కాదు. వ్యవసాయ శాఖ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి రైతుల సమస్య వినగానే చలించాడు. స్పందించాడు. క్వింటాల్ పసుపు ఏ గ్రేడ్‌కు 6,500 రూపాయలు, బి-గ్రేడ్‌కు 6వేల రూపాయలు మద్దతు ధర ప్రకటించారు.***

మంత్రి ఇక్కడ దూరపు ఆలోచన చేయలేదు. జిల్లాలో ఎన్ని క్వింటాళ్ల పసుపు పండిందో తెలుసుకుని అంతవరకు మాత్రమే కొనుగోలు చేయాలని చెప్పలేదు. ఆయన రైతులను దృష్టిలో పెట్టుకుని మాత్రమే మద్దతు ధర ప్రకటించారు. దీనిని ఆసరా చేసుకుని రాజకీయ నాయకులే దళారుల అవతారమెత్తి, బయట జిల్లాల్లో పసుపును కూడా లారీలకు లారీలు కొని ఇక్కడకు తెచ్చి అమ్ముతారని, ఆ విధంగా కూడా డబ్బులు సంపాదించుకునే వాళ్లుంటారని మంత్రి కలలో కూడా వూహించలేదు. పసుపుకు గిట్టుబాటు ధర ప్రకటించిన మంత్రి ఉదారతను ఉదయగిరి ప్రాంత తెలుగుదేశం, వైసిపి, బీజేపీ నాయకులు బాగానే సొమ్ము చేసుకున్నారు. గుంటూరు, ప్రకాశం, కడప జిల్లాల్లో పండిన పసుపును క్వింటాల్ మూడు లేదా, నాలుగు వేల లోపు కొనుగోలు చేసి, ఉదయగిరి ప్రాంతంలోనే పసుపు పండించినట్లుగా విఆర్‌ఓల వద్ద సర్టిఫికేట్లు తీసుకుని, బినామీ పాస్‌బుక్‌లు పెట్టి ఉదయగిరిలోని పసుపు కొనుగోలు కేంద్రానికి పసుపును అమ్మేసి, రైతులకు వెళ్లాల్సిన మద్దతు ధరను మధ్యలో వీళ్లు నొక్కేసారు. జిల్లాలో 7 నుండి 8వేల క్వింటాళ్ల పసుపు మాత్రమే పండుతుండగా బయట జిల్లాల నుండి తెచ్చిన పసుపుతోటి అది 34వేల క్వింటాళ్లకు చేరింది.

పసుపు కొనుగోల్‌మాల్ వ్యవహారంలో ప్రభుత్వం సీరియస్ అయ్యింది. కొనుగోళ్లకు సంబంధించి పలువురు అధికారులను సస్పెండ్ చేశారు. పసుపు పండించని రైతులకు పండించారని దొంగ సర్టిఫికేట్లు అందజేసిన 19మంది విఆర్‌ఓలపై సస్పెండ్ వేటు వేసారు. ఇక పసుపు దందాలో కీలకపాత్ర పోషించిన ఆయా పార్టీల నాయకులపై కూడా క్రిమినల్ కేసులు నమోదు చేయనున్నట్లు కలెక్టర్ ప్రకటించారు. పసుపు వ్యవహారంలో ఉదయగిరి మార్కెటింగ్ కమిటి ప్రస్తుత అధ్యక్షుడు, మాజీఅధ్యక్షుడు కూడా ప్రధానపాత్ర పోషించినట్లు తెలుస్తోంది. నాయకుల దందాకు ముందు అధికారులు బలయ్యారు. అధికారులతో పాటు నాయకులను కూడా శిక్షిస్తేనే ఈ కేసుకు న్యాయం చేసినట్లవుతుంది.

# శతజయంతి వేడుకలకు ముస్తాబవుతున్న ఎన్‌డిసిసిబి



నెల్లూరుజిల్లా కేంద్ర సహకార బ్యాంకు ఏర్పడి వందేళ్లు పూర్తయిన సందర్భంగా శత జయంతి వేడుకలను నిర్వహించేందుకు ఎన్‌డిసిసిబి ముస్తాబవుతోంది. వందేళ్లుగా రైతులకు వివిధ రకాలుగా సేవలందించిన ఈ బ్యాంకు శత జయంతి వేడుకలను తమ పాలకవర్గ హయాంలో నిర్వహించడం తమకెంతో ఆనందంగా ఉందని నెల్లూరుజిల్లా కేంద్ర సహకార బ్యాంక్ ఛైర్మెన్ మెట్టుకూరు ధనుంజయరెడ్డి తెలిపారు. సహకార బ్యాంక్ ఛైర్మెన్ ఛాంబర్‌లో శతజయంతి వేడుకలను నిర్వహించేందుకు ఏర్పాటు చేసిన కమిటి సమావేశం గత నెల 29న జరిగింది. ఈ సందర్భంగా పలు విషయాలపై కూలంకుషంగా చర్చించారు. శత జయంతి వేడుకలకు సంబంధించి సెప్టెంబర్ 8వ తేదీన ఘనంగా ఉత్సవాలను నిర్వహించాలని నిర్ణయించారు. బ్యాంక్ ప్రధాన కార్యాలయ ఆవరణంలో, రైతుల సమక్షంలో వేడుకలను నిర్వహిస్తామని తెలిపారు. ఈ వేడుకలకు రాష్ట్ర వ్యాప్తంగా వున్న డిసిసిబి ఛైర్మెన్‌లను ఆహ్వానిస్తున్నామని, జిల్లాకు సంబంధించిన పార్లమెంటు సభ్యులు, మంత్రులు, ప్రజాప్రతినిధులు అందరూ పాల్గొంటారని తెలిపారు. ఆప్కాబ్ సమావేశం సెప్టెంబర్ 7వ తేదీన జరుగుతుందని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి, వ్యవసాయ శాఖామంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన రైతురథం పథకాన్ని నిర్వహించేందుకు సహకార బ్యాంక్ అన్ని విధాలా సహకరిస్తుందన్నారు. ఈ పథకం ద్వారా ట్రాక్టర్లు తీసుకునే రైతులకు 8.5శాతం వడ్డీతో రుణాలు ఇవ్వనున్నామన్నారు. ఈ సమావేశంలో బ్యాంక్ ఉపాధ్యక్షులు నల్లపరెడ్డి జగన్మోహన్‌రెడ్డి, డైరెక్టర్లు ఏటూరు శివరామ కృష్ణారెడ్డి, వెంకటేశ్వర్లుగౌడ్, సుధీర్‌నాయుడు, వెంకటశేషారెడ్డి, కలికి మాధవరెడ్డి, బ్యాంక్ సిఇఓ వై.సరిత, డిప్యూటీ జనరల్ మేనేజర్ ఎన్.ఉషారాణి, సహాయ జనరల్ మేనేజర్ వై.దయాకర్‌రెడ్డి పాల్గొన్నారు.




## నెల్లూరు కబుర్లు

# సోమిరెడ్డి షటిల్ జర్నీ!



ఆర్టీసీలో నెల్లూరు - పామూరుల మధ్య ట్రిప్పుల బస్సులున్నాయి. ఈ రెండు ఊర్ల మధ్య తిరగడమే ఈ బస్సుల పని. ప్రస్తుతం సేద్యం శాఖ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి పరిస్థితి కూడా పామూరు బస్సులా మారింది. ఆయన నెల్లూరు - నంద్యాల, విజయవాడ - నంద్యాల మధ్య షటిల్ సర్వీసు బస్సులా తిరుగుతున్నాడు. పగలంతా నంద్యాల ఎన్నికల వ్యవహారాలు చూడడం, సాయంత్రమైతే నెల్లూరులో పెళ్ళిళ్ళకు హాజరుకావడం చేస్తున్నాడు. ఒకవేళ విజయవాడలో పనుంటే అక్కడ పని చూసుకుని నంద్యాల వెళ్లడం చేస్తున్నాడు. నంద్యాల ఎలక్షన్ ముగిసే దాకా ఆయనకు ఈ ట్రిప్పుల ప్రయాస తప్పేటట్లు లేదు.

# సొంతింట్లోకి 'చిన్ని' కార్యాలయం



నెల్లూరులో దాదాపు దశాబ్దకాలంగా వ్యాపార, వాణిజ్య వేత్తలకు ఆడిట్ విభాగంలో సేవలందిస్తున్న చిన్ని పెరుమాళ్ అండ్ అసోసియేట్స్ చార్టెడ్ అకౌంటెంట్స్ వారు ఆదిత్యనగర్‌లో నూతనంగా నిర్మించిన కార్యాలయ భవనాన్ని జూలై 30వ తేదీన ప్రారంభించారు. ఈ అసోసియేట్స్ సారధులు చిన్ని నారాయణ రావు ఆడిటర్‌గా కంటే ప్రముఖ కవిగా, రచయితగా అందరికీ సుపరిచితులే! అలాగే వారి తనయుడు చిన్ని శ్రావణ్‌కుమార్ గత ఏడేళ్లుగా ఆడిట్ రంగంలో సేవలందిస్తూ, ఇటీవల కేంద్ర ప్రభుత్వం అమలులోకి తెచ్చిన జిఎస్‌టిపై నెల్లూరీయులకు అవగాహన కల్పించడంలో విశేషకృషి చేస్తూ గుర్తింపు సాధించారు. ఇంతవరకు నర్తకి సెంటర్‌లోని కెఎసి ప్లాజాలో వున్న చిన్ని పెరుమాళ్ అండ్ అసోసియేట్స్ కార్యాలయాన్ని ఆదిత్య నగర్‌లోని నూతన భవనంలోకి మార్చారు. ఈ కార్యక్రమానికి నెల్లూరు గ్రామీణ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, రాజధాని నిర్మాణ కమిటి సభ్యులు, మాజీఎమ్మెల్యే బీద మస్తాన్‌రావు, నెల్లూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటి ఛైర్మెన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, మాజీమంత్రి మానుగుంట మహీధర్‌రెడ్డి, కోమిట్ల కంపెనీస్ అధినేత కె.రెనిల్‌కుమార్‌రెడ్డి, 'లాయర్' వారపత్రిక సంపాదకులు తుంగా శివప్రభాత్‌రెడ్డి, ఆంధ్రా బ్యాంక్ మాజీ డైరెక్టర్, సీనియర్ ఆడిటర్ కాసు సుధాకర్‌లు ముఖ్యఅతిథులుగా విచ్చేసి చిన్ని నారాయణరావు, శ్రావణ్‌కుమార్‌లకు తమ అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథులను నారాయణరావు, శ్రావణ్‌లు శాలువాలు, జ్ఞాపికలతో సత్కరించారు.

# నిరుపేద క్రీడాకారిణికి 'వాకర్స్' చేయూత



నిరుపేద కుటుంబంలో జన్మించిన పి.జయహారిక అనే ప్రతిభగల క్రీడాకారిణికి నెల్లూరులోని ఏసి సుబ్బారెడ్డి వాకర్స్ అసోసియేషన్‌వారు ఆర్థిక సాయం అందించి తమ వితరణను చాటుకున్నారు. ఖోఖోలో దాదాపు 30 సీనియర్స్ నేషనల్స్ గేమ్స్‌కు సంబంధించి 40స్టేట్‌మీట్‌లలో ఆమె తన క్రీడాప్రతిభను చాటుకుంది. ఇటీవల 2017 ఏపి పీసెట్ ఫలితాల్లో బిపిఇడిలో ప్రథమర్యాంకు కూడా సాధించింది. ఆమె కాలేజీ ఫీజుల కోసం వాకర్స్ అసోసియేషన్‌వారు 17వేల రూపాయలను ఆర్థిక సాయంగా అందించారు. ఈ కార్యక్రమంలో ఏసి సుబ్బారెడ్డి వాకర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ వేలూరు రంగారావు, సెక్రటరీ స్వర్ణ రమేష్‌బాబు, కోశాధికారి పొన్నం రవిచంద్ర, రాఘవేంద్రపెట్టి, బెజవాడ సుందరరామిరెడ్డి, శ్రీనివాసులురెడ్డి, తులసీరాం, వేణు నాయుడు తదితరులు పాల్గొన్నారు. కాగా, ఏసి స్టేడియం స్పోర్ట్స్ హాస్టల్‌లో చదువుకున్న ఈ క్రీడాకారిణి టెన్త్‌లోనూ, ఇంటర్‌లోనూ ప్రథమశ్రేణిలో ఉత్తీర్ణురాలైంది కూడా.



## ముస్తాబవుతున్న గణపయ్యలు!

ఏ పండుగకైనా రెండు, మూడు రోజుల ముందు నుండి పండుగ సందడి నెలకొంటుంది. కాని, హైందవ పండుగలలో వినాయకచవితి ప్రత్యేకం. నెల రోజుల ముందు నుండే ఈ పండుగ వాతావరణం కనిపిస్తుంది. ఈ నెల 25వ తేదీన వినాయక చవితి. పండుగను దృష్టిలో పెట్టుకుని నెల్లూరు నగరంతో పాటు జిల్లాలోని పలు ప్రాంతాల్లో కళాకారులు భారీ సంఖ్యలో విగ్రహాలను తయారుచేస్తున్నారు. భక్తులను ఆకర్షించే రీతిలోనే కాకుండా, తొందరగా నాలుగు బొమ్మలు అమ్ముకునే ఉద్దేశ్యంతో వినాయకుడి విగ్రహాలను వైరైటీ గెటప్‌లలో తయారు చేస్తున్నారు.

# పేద విద్యార్థినిని ఆదుకున్న చందు



చదువులో ఎంతో ప్రతిభ కనపరుస్తున్న చిట్టమూరు మండలానికి చెందిన ఓ పేద విద్యార్థినికి మాగుంట శరత్‌చంద్రారెడ్డి సేవా సమితి ఆధ్వర్యంలో ఇటీవల ఆర్థికసాయం అందించారు. ఈ సందర్భంగా శరత్‌చంద్ర(చందు) మాట్లాడుతూ, చిట్టమూరు మండలంలోని కొత్తగుంట టిఎంఆర్ జూనియర్ కాలేజీలో ఇంటర్ చదువుతున్న నిరుపేద విద్యార్థిని కె.శిరీష ఇటీవల ఇంటర్‌లో 92శాతం మార్కులు సాధించిందని, గూడూరులోని డిఆర్‌డబ్ల్యు డిగ్రీ కాలేజీలో ఫ్రీ సీటు వచ్చిందని, అయితే ఆ విద్యార్థిని తల్లిదండ్రులు నిరుపేదలు కావడంలో హాస్టల్‌లో నెలకు వెయ్యి రూపాయలు చెల్లించలేని స్థితిలో ఉన్నందువల్ల, ఆ విద్యార్థినికి సాయంగా తమ సేవాసమితి వారు 10 వేల రూపాయల చెక్కును అందజేశామన్నారు. బాగా చదువుకుంటూ, మంచి మార్కులు సాధిస్తున్న పేద విద్యార్థులకు తమ సహాయసహకారాలు ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో మాగుంట శరత్‌చంద్రారెడ్డి మిత్రులు కె.హరికిషన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## వ్యవసాయ శాఖ ఇన్‌ఛార్జి జేడిగా ఆనందకుమారి

వ్యవసాయ శాఖ ఇన్‌ఛార్జి సంయుక్త సంచాలకులుగా ఆత్మ పిడి ఆనందకుమారిని నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటివరకు జేడీగా వున్న హేమమహేశ్వరరావు పదవీ విరమణ చేయడంతో అనంతపురం భూసార పరీక్షల కేంద్రం ఉపసంచాలకులుగా ఉన్న చంద్రనాయక్‌కు పదోన్నతి కల్పిస్తూ నెల్లూరు జేడిగా ఉత్తర్వులు జారీ చేసింది. చంద్రనాయక్ బాధ్యతలు స్వీకరించకుండా సెలవుపై వెళ్ళడంతో ఇన్‌ఛార్జ్ జేడిగా ఆనందకుమారి బాధ్యతలు స్వీకరించారు.

# నడిరోడ్లోకి చొచ్చుకొస్తున్న ఆక్రమణలు



నెల్లూరు నగరంలో ఆక్రమణలు నడిరోడ్లోకి చొచ్చుకొస్తున్నాయి. నగరం వేగంగా పెరుగుతోంది. శివారు ప్రాంతాలు సైతం ఇబ్బడిముబ్బడిగా వెలుస్తున్నాయి. దీంతో నెల్లూరు నగర జనాభా 8లక్షలకు పెరిగింది. వాహనాలు పెరిగాయి. అవసరానికి మించిన ఆటోలు కనిపిస్తున్నాయి. నడక కూడా నరకమే అన్న విధంగా నగరం తయారైంది. ప్రయాణం భారమైంది. నిత్యం ట్రాఫిక్‌జామ్ సమస్యతో ప్రజలు సతమతమవుతున్నారు. ఫుట్‌పాత్‌లు మాయమైపోయాయి. కార్పొరేషన్ అధికారులు గాని, ఆర్ అండ్ బి, పోలీసు, ట్రాఫిక్ పోలీసులు నగరం గురించి పట్టించుకోవడం లేదు. సొంత స్థలాల్లో వ్యాపార దుకాణాలు నిర్మించుకుంటున్న యజమానులు నడివీధుల్లో మెట్లు, ర్యాంపులు కట్టేస్తున్నారు. నెల్లూరు నగరంలోని చిన్నబజారు, పెద్దబజారు, ట్రంకు రోడ్డు, స్టోన్‌హౌస్‌పేట తదితర ప్రాంతాల్లో నడిరోడ్లో వాహనాలు పార్కింగ్ చేస్తున్నారు. ఆత్మకూరు బస్టాండు వద్ద టౌన్ బస్సులు, ఆటోలు ఎప్పుడూ రోడ్డుపైనే నిలబెట్టేస్తున్నారు. ఆత్మకూరు బస్టాండ్ ఆక్రమణల నిలయంగా మారింది. ఓ వైపు పూలఅంగళ్ళు, మరోవైపు పండ్ల తోపుడు బండ్లతో ట్రాఫిక్‌జామ్ సమస్యను కలిగిస్తున్నాయి. మినీబైపాస్‌రోడ్డు పూర్తిగా ఆక్రమణలకు గురైంది. ముత్తుకూరు బస్టాండ్ వద్ద విఆర్‌సి ప్రహరీగోడ కింద పండ్ల తోపుడు బండ్లతో రోడ్డు కుంచించుకుపోయి నిత్యం ట్రాఫిక్ జామ్ సమస్య తలెత్తుతోంది. ఇలా నెల్లూరు నగరం మొత్తం ఆక్రమణలతో ప్రజలకు నరకాన్ని చూపిస్తున్నాయి. ఈ నరకం నుంచి ప్రజలను బయటపడేసే అధికారి కోసం నెల్లూరు ప్రజలు ఎదురు చూస్తున్నారు.

# పచ్చదనంతోనే పర్యావరణానికి రక్ష

### - ఆనం రంగమయూర్‌రెడ్డి



ప్రజలందరూ స్వచ్ఛందంగా మొక్కలు నాటడం ద్వారా పచ్చదనాన్ని, పర్యావరణాన్ని కాపాడుకోవచ్చని, ప్రతి ఒక్కరూ తమ ఇళ్ళలో, పరిసరాల్లో మొక్కలు నాటుకోవాలని 12వ డివిజన్ కార్పొరేటర్ ఆనం రంగమయూర్‌రెడ్డి అన్నారు. గతనెల 29న ఆయన విఆర్ విద్యాసంస్థలు దత్తత తీసుకున్న రాజుపాళెంలో వనం-మనం కార్యక్రమంలో పాల్గొని మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పరిసరాలు పచ్చదనంతో కళకళలాడాలంటే మొక్కలు నాటాలన్నారు. ఇప్పుడు నాటుతున్న మొక్కలను గ్రామస్తులు నీళ్లు పోసి పెంచుకోవాలని, వాటిని సంరక్షించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట సివిఎస్ భాస్కర్, రవి, జన్మభూమి కమిటీ ప్రతినిధి శ్రీనివాసులు, వెంకయ్య, పురంధర్, అధికారులతో పాటు విఆర్ విద్యాసంస్థల సిబ్బంది పాల్గొన్నారు.




# రైతుల సమస్యలు పరిష్కరిస్తాం

**- మంత్రి సోమిరెడ్డి**

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని, రైతుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం ఎల్లవేళలా ముందుటుందని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. గతనెల 29న నెల్లూరులోని జడ్పీ సమావేశమందిరంలో జరిగిన రైతుల సమగ్రాభివృద్ధి అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ, వ్యవసాయశాఖకు రాష్ట్ర ప్రభుత్వం అత్యధికంగా నిధులు కేటాయించి అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతోందన్నారు. అయితే, రైతులకు సంబంధించిన ప్రతి సమస్యను ప్రభుత్వం తీర్చలేకపోయినా రైతాంగం, రైతు సంఘాలు ఆయా సమస్యలను పరిష్కరించేవిధంగా చూడాలన్నారు. మిర్చి, పసుపు రైతులు నష్టాల్లో ఉన్నప్పుడు ప్రభుత్వం ఆదుకుని కనీస మద్దతుధరను ప్రకటించిందన్నారు. రైతుల సమస్యలు తీర్చేందుకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందన్నారు. నకిలీ విత్తనాలు, మందులు సరఫరా చేసే పెద్ద కంపెనీలను ప్రభుత్వం గుర్తించి వాటి లైసెన్స్‌లను రద్దు చేసిందన్నారు. బయోమెట్రిక్ విధానంలో లోటుపాట్లు ఉన్నట్లు తమ దృష్టికి వచ్చిందని, అర్జీలు ఇస్తే ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తామన్నారు. రైతులకు కేంద్రప్రభుత్వం రుణ సౌకర్యం కోసం 8లక్షల60వేల కోట్లు నిధిని కేటాయించి కౌలురైతులకు రుణాలు మంజూరు చేయాల్సివుండగా ఆ పథకం అమలు తక్కువగా ఉందని, కౌలురైతులకు బ్యాంకర్లు సక్రమంగా రుణాలు ఇవ్వడం లేదని, రకరకాల పంటల బీమా పథకాలు ఉన్నప్పటికీ రైతులకు ఏ ఒక్క పథకం కూడా పూర్తిస్థాయిలో అమలుకావడం లేదని ఆయన ఈ సందర్భంగా అసంతృప్తి వ్యక్తం చేశారు. కోవూరులో మూతపడిపోయిన చెరకు ఫ్యాక్టరీని తిరిగి తెరిపించేందుకు ప్రయత్నాలు చేపట్టామన్నారు. అదేవిధంగా మార్కెటింగ్‌శాఖ గోడౌన్ల నిర్మాణాలకు స్థలాలు గుర్తించి తనకు తెలియజేస్తే, కలెక్టర్‌తో సంప్రదించి నిర్మాణాలు చేపడతామన్నారు. ఎఫ్‌సిఐ గోడౌన్లు ఖాళీగా ఉన్నాయని, కేంద్రప్రభుత్వం అనుమతి తీసుకుని రైతులు ధాన్యం నిల్వ చేసుకునే సదుపాయం కల్పిస్తామన్నారు. రైతుల సమైఖ్య భవనం రైతులు సొంత నిధులతో నిర్మాణం చేసుకోవడానికి కలెక్టర్‌తో మాట్లాడి స్థలం మంజూరు చేయిస్తామన్నారు. ఈ సమావేశంలో వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ హేమమహేశ్వరరావు, హార్టికల్చర్ ఏ.డి ఉమాదేవి, ఏపి ఎంఐపి పి.డి కెవి రమణరావు, రైతు సంఘాల సమాఖ్య కార్యదర్శి సిఎస్ఆర్ కోటిరెడ్డి, ఎఫ్ఎఫ్ఏ ముఖ్య సలహాదారు సిఐఎఫ్ఏ పెద్దిరెడ్డి చెంగల్‌రెడ్డి, రైతాంగ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు యర్నేని నాగేంద్రనాథ్ తదితరులు పాల్గొన్నారు.

## పశు సంవర్ధక శాఖ ఇన్‌ఛార్జి జేడీగా ఠాగూర్

నెల్లూరుజిల్లా పశు సంవర్ధక శాఖ ఇన్‌ఛార్జి జేడీగా ఒంగోలు జేడీ డాక్టర్ రవీంద్రనాథ్ ఠాగూర్‌ను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటివరకు జేడీగా వున్న శ్రీధర్‌కుమార్ పదవీ విరమణ చేయడంతో రవీంద్రనాథ్ ఠాగూర్ ఇన్‌ఛార్జ్ జేడీగా బాధ్యతలు స్వీకరించారు.

# వెనక్కి తగ్గేదే లేదు!



## • 'దేశం' నేతలకు మింగుడుపడని ఎస్పీ

పోలీస్‌స్టేషన్‌కు వెళితే ఎస్ఐ మా మాట వినడం లేదు... ఎస్ఐ చేత పని చేయించుకోలేకుంటే నా అనుచరులు ముందు నా పరువు పోతుంది.. ఎస్ఐ వద్దే పరపతిలేనోడివి... నువ్వేం నాయకుడివని అనుచరులు నన్ను వదిలిపోతున్నారు.... ఓ మండల స్థాయి నాయకుడు తన నియోజకవర్గ తెలుగుదేశం ఎమ్మెల్యేకో, లేదా ఇన్‌ఛార్జ్‌కో మొరపెట్టుకుంటాడు. ఎమ్మెల్యే లేదా ఇన్‌ఛార్జ్‌ల వద్ద సీన్ ఏంటంటే... రోలు వచ్చి మద్దెలతో మొరపెట్టుకున్నట్లుంది... సి.ఐలు, డిఎస్పీలు మా మాట వినడం లేదు... ఏదన్నా పని చెబితే ఎస్పీ చేత చెప్పించమంటున్నారు. రూల్స్ ప్రకారం చేసే పనులైతే మన పార్టీవాళ్లకు మనతో పనేంటి... పోనీ ఎస్పీకే చెబుదామా అంటే... అక్కడ నుండి ఎలాంటి రియాక్షన్ వుంటుందో తెలియదు. మా సమస్యను ఇక మేం జిల్లా మంత్రులకే చెప్పుకోవాలి... ఇదీ జిల్లాలో అధికారపార్టీ ఎమ్మెల్యేలు, నియోజకవర్గాల ఇన్‌ఛార్జ్‌ల పరిస్థితి.

జిల్లా ఎస్పీగా వచ్చిన రామకృష్ణ అధికారపార్టీ వాళ్ళకు మింగుడు పడడం లేదు. ఆయన పనితీరు రాజకీయాలకు అతీతంగా ఉంటుంది. అధికారపార్టీ వారికో న్యాయం, ప్రతిపక్షానికో న్యాయం అన్నట్లుగా వ్యవహరించడం లేదు. రూల్ రూలే అన్నట్లుగా పోతున్నాడు. తన పోలీసు డ్యూటీ తాను చేసుకుపోతున్నాడు. ఎప్పుడైనా పోలీసులు కరెక్ట్‌గా డ్యూటీ చేస్తే ముందుగా ఇబ్బంది పడేది అధికారపార్టీ నాయకులే! ఎందుకంటే అధికారం చేతిలో వుంది కదా అని చెప్పి అడ్డగోలు పనులు చేసేది వాళ్లే కదా! ఈ అడ్డగోలు పనుల్లో ప్రధానమైనది ఎర్రచందనం అక్రమ రవాణా, అక్రమ మైనింగ్. ఎస్పీ రామకృష్ణ బెట్టింగ్స్‌తో పాటు ఇసుక, గ్రావెల్, సిలికా రవాణాలపైన దృష్టి పెట్టాడు. ముఖ్యంగా జిల్లాలో పలు రీచ్‌ల నుండి అధికారపార్టీ నాయకులు ఇసుక అక్రమ రవాణాకు పాల్పడుతూ నాలుగు రూపాయలు సంపాదించుకుంటున్నారు. ఎస్పీ రామకృష్ణ ఇసుక రవాణాను ఇటీవల కట్టడి చేశారు. పగలు ఇసుక రవాణా వాహనాలు నగరంలోకి ప్రవేశించకుండా ఆంక్షలు విధించారు. ఇసుక మీద కాసులు ఏరుకోవడానికి అలవాటుపడ్డ అధికారపార్టీ వాళ్లు ఈ విషయాన్ని జిల్లా ఇన్‌ఛార్జ్‌మంత్రి ఆకే అమర్‌నాథ్‌రెడ్డి, మున్సిపల్ మంత్రి పి.నారాయణలతో మొరపెట్టుకున్నారు. మంత్రులిద్దరూ ఇటీవల ఎస్పీ రామకృష్ణను పినాకిని అతిథిగృహానికి పిలిపించుకున్నారు. ఇసుక వాహనాలను చూసీ చూడనట్లు వదిలేయాలని ఎస్పీపై ఒత్తిడి తెచ్చారు. అందుకు ఆయన ఏ మాత్రం అంగీకరించలేదని తెలుస్తోంది. పోలీసు విధుల్లో మీరు వేలు పెట్టొద్దు. ఈ జిల్లాలో నేను సంస్కరించాల్సిన పనులు చాలా ఉన్నాయి. మీ దారికి నేను అడ్డు రాను, నా దారికి మీరు అడ్డుపడొద్దు. కొన్ని సమస్యలను దారికి తెచ్చేదాకా ఎలాంటి ఒత్తిళ్లకు లొంగేది లేదని ఆయన ఖరాఖండీగా తేల్చి చెప్పినట్లు సమాచారం.

## • బొల్లినేనికి వింత సమస్య

# వర్గాన్ని కాపాడుకోవడమా..?

# నియోజకవర్గాన్ని వదులుకోవడమా?



***జిల్లాలో పసుపు కొనుగోలు అక్రమాల సంగతేమోగాని దీనిమూలంగా ఉదయగిరి ఎమ్మెల్యే బొల్లినేని రామారావుకు పెద్ద చిక్కొచ్చిపడింది.***

పసుపు కొనుగోలు వ్యవహారాన్ని పెద్దకుంభకోణంగా చిత్రించిపెట్టారు. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం సీరియస్ అయ్యింది. విచారణకు ఆదేశించి భారీ ఎత్తున ఉద్యోగులను సస్పెండ్ చేసింది. ఈ భాగోతంలో అసలు పాత్రధారులు ఉదయగిరి ప్రాంతానికి చెందిన తెలుగుదేశం, బీజేపీ, వైసిపి నాయకులు. అధికారంలో లేరు కాబట్టి వైకాపా నేతలను కేసుల నుండి బయటపడేసే పరిస్థితి లేదు. కాని, తెలుగుదేశం నాయకుల మీద కూడా కేసులు నమోదు చేయడం జరిగింది. దీనిపై అధికారపార్టీ నాయకులు మండిపడుతున్నారు.

మేమేమన్నా దొంగతనం చేసామా? దోపిడీలు చేసామా? లేని వస్తువును వున్నట్లు చూపించి ప్రభుత్వ నిధులను దోచేసామా? పసుపును రైతుల వద్ద తక్కువ ధరకు కొని ఇక్కడ మద్దతుధరకు అమ్ముకుని నాలుగు రూపాయలు సంపాదించుకున్నాం. కాకపోతే ఇక్కడే పసుపును సాగు చేసినట్లు విఆర్‌ఓల దగ్గర సర్టిఫికెట్లు తీసుకున్నాం. అధికారపార్టీలో వున్నాం. ఎలక్షన్‌లలో పార్టీ జెండాలు మోసాం, ఓటర్ల చుట్టూ తిరిగి పార్టీకి ఓట్లేయించాం, పార్టీ కోసం మేం ఇంత చేస్తే చివరకు మా మీదే కేసులు పెడతారా? ఇందుకేనా మేం పార్టీలో వుండేది అంటూ ఉదయగిరి తెలుగుదేశం నేతలు స్థానిక ఎమ్మెల్యే బొల్లినేని రామారావును నిలదీస్తున్నారు.

దీంతో ఎమ్మెల్యే బొల్లినేని రామారావు పరిస్థితి అడకత్తెరలో పోకచెక్కలా తయారయ్యింది. ఓ పక్క ప్రభుత్వమేమో పసుపు వ్యవహారంపై సీరియస్‌గా వుంది. ఎవర్నీ వదిలే ప్రసక్తేలేదని, పసుపు నిందితులపై చర్యలు తీసుకోవడం ద్వారా ఈ చంద్రబాబు చంధశాసనుడని, అన్యాయాలను, అక్రమాలను సహించడని చాటుకోవాలనుకుంటున్నారు. స్వయంగా ముఖ్యమంత్రే పసుపు అక్రమాలపై దృష్టి పెట్టి చర్యలకు ఆదేశించడంతో జిల్లాలో మంత్రులు తమ పార్టీ వారిని కాపాడుకునే పరిస్థితి లేకుండా పోయింది. మంత్రులకే సీన్‌లేకపోతే ఇక ఎమ్మెల్యేగా బొల్లినేని ఏం చేయగలడు? అలాగని తన వర్గీయులను ఈ కేసుల నుండి కాపాడుకోలేకపోతే, ఇక అతనిని నమ్మి నాయకులెవరూ వెనుక నడిచే పరిస్థితి లేదు.

బొల్లినేనిలో ఇదే ఆందోళన కనిపిస్తోంది. ఈ కేసుల నుండి తన వర్గీయులను కాపాడుకోలేకపోతే నియోజకవర్గంలో ఇది ఆయనకు పెద్ద డామేజ్ అవుతుంది. అలాగని ఇక్కడ నాయకులపై చర్యలు తీసుకోకపోతే రాష్ట్రస్థాయిలో ప్రతిపక్షానికి ఇదో ప్రచార అస్త్రమవుతుంది. కాబట్టి ఉదయగిరి తెలుగుదేశం నాయకులపై కేసులు నమోదు కాకుండా చర్యలు తీసుకోకుండా అడ్డుకోవడం ఎమ్మెల్యే బొల్లినేనికి తలకు మించిన పనే! కేసులు నమోదై ఇక్కడ తెలుగుదేశం నాయకుల మీద చర్యలు తీసుకుంటే మాత్రం ఉదయగిరి రాజకీయాలలో మున్ముందు పెనుమార్పులు చోటుచేసుకునే అవకాశాలున్నాయి.

# శ్రీసిటీకి పలు ప్రధాన రోడ్ల అనుసంధానం



చెన్నై-వైజాగ్ పారిశ్రామిక కారిడార్లో ప్రధానభాగమైన శ్రీసిటీకి చిత్తూరుజిల్లాలోని పలు ప్రధాన రోడ్డు మార్గాలను అనుసంధానం చేస్తూ, వాటిని నాలుగు, ఆరు లైన్ల రోడ్లుగా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నట్లు చిత్తూరుజిల్లా కలెక్టర్ పి.ఎస్ ప్రద్యుమ్న పేర్కొన్నారు. కొన్ని రోడ్లకు ఇప్పటికే నిధులు మంజూరయ్యాయని కూడా ఆయన తెలిపారు. శ్రీసిటీలో గతనెల 29న ఫైర్‌స్టేషన్ ప్రారంభోత్సవం అనంతరం బిజినెస్ సెంటర్‌లో ఏర్పాటైన శ్రీసిటీ పరిశ్రమల సిఇఓల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కంపెనీ ప్రతినిధులు తన దృష్టికి తెచ్చిన పలు సమస్యలు, కోర్కెలపై కలెక్టర్ సానుకూలంగా స్పందించారు. శ్రీసిటీ నుంచి తిరుపతి ఎయిర్‌పోర్ట్ వరకు ప్రతిపాదించిన 4లైన్ల రోడ్డు పూర్తయితే కేవలం 45 నిమిషాల్లోనే శ్రీసిటీ నుంచి విమానాశ్రయానికి చేరవచ్చన్నారు. శ్రీసిటీ సమీపంలోని చెరివి విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద మరో నూతన 220 కెవి సబ్ స్టేషన్ నిర్మాణానికి పదెకరాల ప్రభుత్వ స్థలం కేటాయిస్తామన్నారు. శ్రీసిటీలోని చెరువుల్లో పూడికతీత పనులు చేపట్టడం ద్వారా ఎక్కువ నీరు నిల్వ చేసుకునే సౌకర్యం కలుగజేస్తామన్నారు. ఇఎస్ఐ ఆసుపత్రి నిర్మాణానికి శ్రీసిటీ సమీపంలో అయిదెకరాల ప్రభుత్వ స్థలాన్ని కేటాయిస్తామన్నారు. సత్యవేడు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలను అప్‌గ్రేడ్ చేయనున్నట్లు తెలిపారు. శ్రీసిటీ పరిసర ప్రాంతాల్లో సామాజిక, మౌలిక వసతుల కల్పన, అభివృద్ధిలో భాగంగా బ్రిడ్జిస్కూల్, మరో రెండు స్కూల్స్ యాజమాన్యాలతో చర్చిస్తామన్నారు. అనంతరం శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ రవీంద్ర సన్నారెడ్డి మాట్లాడుతూ, శ్రీసిటీలో ఇండస్ట్రియల్ ఎకో సిస్టం బాగా అభివృద్ధి చెందిందని, ప్రస్తుతం సోషల్ ఎకో సిస్టం అభివృద్ధిపై దృష్టి సారించామని అన్నారు. ఇందులో భాగంగా రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో పోస్ట్‌ఆఫీస్, ఫైర్‌స్టేషన్, పోలీస్ స్టేషన్ ఏర్పాట్లు జరిగాయని, పరిశ్రమల యాజమాన్యాలు సహకరిస్తే పూర్తిస్థాయిలో సోషల్ ఎకో సిస్టం అభివృద్ధి సాధ్యమవుతుందని వివరించారు.


ఆధునాతన గృహోపకరణాలకు చిరునామా

**అమ్మ ఫర్నిచర్ మాల్**

మినీబైపాస్‌రోడ్, నెల్లూరు.

Latest & New Models

ప్రతి కొనుగోలు పై డిస్కౌంట్ కలదు

# అక్రమంగా ఇసుక తరలిస్తే కఠినచర్యలు

**- జిల్లా కలెక్టర్ ఆర్.ముత్యాలరాజు**

అక్రమంగా ఇసుకను తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ ఆర్.ముత్యాలరాజు హెచ్చరించారు. గతనెల 29న ఆయన తన బంగళాలో పోలీస్, రెవిన్యూ, గనులశాఖ తదితర అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, అక్రమంగా ఇసుక తరలింపు, ఇసుక నిల్వల పట్ల చట్టపరమైన చర్యలు తీసుకునే అధికారాన్ని మండల, డివిజన్ స్థాయి అధికారులకు దాఖలుపరచినట్లు తెలిపారు. జిల్లాలో 28 అధికారిక ఇసుకరీచ్‌లు, 163 మూడవ శ్రేణి రీచ్‌లను ప్రజల గృహనిర్మాణాలకు, తదితర అవసరాలకు ఉచితంగా వినియోగించుకోవడానికి కేటాయించామని తెలిపారు. నాయుడుపేట రెవిన్యూ డివిజన్‌లో ఇసుకకు ఉన్న డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకుని ప్రస్తుతం ఉన్న ఒక ఇసుక రీచ్‌తో పాటు అదనంగా మరో 4 ఇసుకరీచ్‌లను ప్రజలకు అందుబాటులోకి తీసుకురానున్నామన్నారు. అదేవిధంగా తడ, దొరవారిసత్రం మండలాల్లో కూడా అదనపు ఇసుక రీచ్‌లు ఏర్పాటుచేసే అవకాశాలను పరిశీలిస్తున్నామన్నారు. ప్రభుత్వ నిబంధన 42 మేరకు అక్రమంగా ఇసుక తవ్వకాలు, తరలింపు చేసేవారిపై లక్ష రూపాయల చొప్పున అపరాధ రుసుము విధించే అధికారం ఆర్డీఓలకు ఉందన్నారు. ఈ విషయంలో జిల్లా అధికారులను సంప్రదించాల్సిన అవసరం ఆర్డీఓలకు లేదన్నారు. ప్రస్తుతం జిల్లాలో ఇసుకకు ఉన్న డిమాండ్ దృష్ట్యా అంతర్ జిల్లా, అంతర్ రాష్ట్ర ఎగుమతులు, దిగుమతులు నిషేధించబడ్డాయని వివరించారు. సమావేశం తీర్మానం మేరకు ఇసుకను తరలించే వాహనాలు, పాకెట్ రేడియో సిస్టమ్‌ను ఉపయోగించాలన్నారు. జాయింట్ కలెక్టర్ సూచన మేరకు మండలస్థాయి అధికారులు తాము సీజ్ చేసిన అక్రమ ఇసుకవాహనదారులపై కేసులు నమోదు చేసి సంబంధిత ఆర్డీఓలకు నివేదించాలన్నారు. ఆయా ఆర్డీఓలు వారికి అపరాధరుసుం విధిస్తారన్నారు. ఎవరైనా వ్యక్తి, లేదా వ్యక్తుల సమూహం ఇసుక రవాణాలో గుత్తాధిపత్యం కలిగినా, ఇళ్ళ అవసరాలకు ఇసుకను తీసుకెళ్లే వ్యక్తులను అడ్డగించినా, లేదా రహదారులకు ఉద్దేశపూర్వకంగా ఆటంకం కలిగించినా, చట్టపరమైన నిబంధనలు ఉల్లంఘించినా అలాంటివారికి రెండు సంవత్సరాల వరకు జైలుశిక్ష, రెండు లక్షల రూపాయల జరిమానా విధించబడుతుందని కలెక్టర్ ఈ సందర్భంగా స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ పిహెచ్‌డి రామకృష్ణ, జాయింట్ కలెక్టర్ ఎఎండి ఇంతియాజ్, ఆత్మకూరు, కావలి, నెల్లూరు, గూడూరు డిఎస్‌పిలు, ఆర్డీఓలు, జిల్లా రెవిన్యూ అధికారి వెంకటసుబ్బయ్య, గనులశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ టి.రాజశేఖర్ పాల్గొన్నారు.



## గూడూరు డివిజన్ వార్తలు

### గూడూరు బ్రాహ్మణ సేవాసంఘం ఆధ్వర్యంలో
# బ్రాహ్మణ కమ్యూనిటీ భవనానికి భూమిపూజ



గూడూరు బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో గత నెల 30వ తేదీ ఉదయం బ్రాహ్మణ కమ్యూనిటి భవనానికి భూమి పూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సేవాసంఘ సమాఖ్య గూడూరు శాఖ అధ్యక్షుడు యరగుడిపాటి చలపతిరావు, ఉపాధ్యక్షుడు ఆనిమెళ్ళ శివ కుమార్, నాథబ్రహ్మ, కార్యదర్శి సిహెచ్ శ్రీనివాసరావు పాల్గొని మాట్లాడుతూ ఎన్నో ఏళ్ళుగా గూడూరు పట్టణంలో బ్రాహ్మణులకు చిన్న చిన్న కార్యక్రమాలు నిర్వహించుకొనేందుకు సరైన వసతి సదుపాయం లేదని, దీన్ని దృష్టిలో పెట్టుకుని అప్పట్లో భవన నిర్మాణానికి ముంగమూరు సీతమ్మ విరాళంగా ఇచ్చిన స్థలంలో నేడు భవన నిర్మాణం చేపడుతున్నామన్నారు. ఈ సందర్భంగా గూడూరు పట్టణంలోని బ్రాహ్మణులు తగు సహాయ సహకారాలు అందించవలసిందిగా బ్రాహ్మణ సంఘం తరపున కోరుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కమిటి సభ్యులు నాగేంద్రప్రసాద్, శ్రావణ్‌కుమార్, కడివేటి రామమూర్తి, డి.బి.శ్రీనివాస్, ఆనిమెళ్ళ సుబ్రహ్మణ్యం, అల్లాడి వెంకటేశం, కె.ప్రకాశరావు, ఆనిమెళ్ళ రాజేశ్వరీదేవి, ఆనిమెళ్ళ రమారాధ పాల్గొన్నారు.

### ఏబిబిఎఫ్ కోశాధికారిగా
# చలపతిరావు



ఆలిండియా బ్రాహ్మణ ఫ్రంట్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటి కోశాధికారిగా యరగుడిపాటి చలపతిరావును నియమించారు. ఈయన గూడూరు బ్రాహ్మణ సంఘ అధ్యక్షుడిగా ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్నారు. ప్రముఖ న్యాయవాదిగా గవర్నమెంట్ ప్లీడర్‌గా పని చేశారు. చలపతిరావును కోశాధికారిగా నియమించడం పట్ల గూడూరు బ్రాహ్మణ సేవా సంఘం హర్షం వ్యక్తం చేసింది.

### దేవాలయాల వద్ద
# వైజేపీ లయన్స్ మొక్కలు



గూడూరు వైజేపీ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం వివిధ దేవాలయాల వద్ద మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో వైజేపీ లయన్స్ క్లబ్ సభ్యులు ఆర్.వి.రావు తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి కోసం అహర్నిశలు శ్రమిస్తా

**- ఎమ్మెల్యే సునీల్**



గూడూరు నియోజకవర్గ అభివృద్ధి కోసం అహర్నిశలు కష్టపడి పనిచేస్తానని గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ అన్నారు. గత నెల 31న గూడూరు పట్టణ రోడ్లు భవనాల అతిథి గృహంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్‌టిఆర్ హౌసింగ్ ద్వారా గూడూరు పురపాలక సంఘ పరిధిలో లబ్దిపొందిన లబ్దిదారులు అర్హులుగా ఉంటేనే ఇల్లు పొందుతారని, ఒకవేళ ముందుగా ఇల్లు ఉండి మళ్లీ దరఖాస్తు చేసుకొని వుంటే అలాంటి వారిని అనర్హులుగా ప్రకటిస్తారని తెలిపారు. గ్రామాల్లో కట్టుకునే ఇళ్లకు కూడా ప్రభుత్వం వారి కొలతలకు లోబడి కట్టుకోవాలని చెప్పారు. గూడూరు పట్టణంలో ఇంకా ఇల్లు లేని వారికి కేంద్ర ప్రభుత్వం పల్స్‌సర్వేను నిర్వహిస్తుందని, ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు సహాయ సహకారాలతో మోడీ ప్రభుత్వం 2లక్షల ఇళ్లు నిర్మాణాలకు అందిస్తుందని తెలిపారు. నాబార్డు నిధులు గూడూరు ఎస్టీ బాలికల పాఠశాలకు రూ.కోటి47లక్షల50వేలు, ఎస్టీ బాలుర పాఠశాలకు కోటి రూ.63లక్షలు, చెన్నూరు, యాకసిరి మల్లాం, పాటిమిట్ట, గునపాడు తదితర ప్రాంతాల్లో ఓహెచ్‌ఆర్ ట్యాంకుల మరమత్తులకు ఒక్కొక్క ట్యాంకుకు రూ.5లక్షలు వంతున నిధులు మంజూరైనట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ పట్టణ అధ్యక్షుడు పులిమి శ్రీనివాసులు, మండల అధ్యక్షుడు కొండూరు వెంకటేశ్వర్లురాజు, కౌన్సిలర్ వాటంబేడు శివకుమార్, తెలుగుదేశం పార్టీ నాయకులు నెలబల్లి భాస్కర్‌రెడ్డి, నాగరాజు, మధుసూధన్‌రెడ్డి, నిమ్మకాయల నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

# నిబద్ధతతో పని చేస్తే మంచి గుర్తింపు

**- రైల్వే సిఐ దశరథరామారావు**



హెడ్‌కానిస్టేబుల్ పోలిరెడ్డి దంపతులను సన్మానిస్తున్న రైల్వే సిఐ దశరథరామారావు, ఎస్సైలు సుధాకర్, బాబి, నరేష్ తదితరులు

ప్రతిఒక్కరూ తమ విధుల్లో నిబద్ధతతో పనిచేస్తే ప్రత్యేక గుర్తింపు లభిస్తుందని రైల్వే సిఐ దశరథ రామారావు తెలిపారు. గూడూరు రైల్వే హెడ్‌కానిస్టేబుల్ పోలిరెడ్డి పదవీ విరమణను పురస్కరించుకుని సోమవారం సన్మాన కార్యక్రమాన్ని గూడూరు పట్టణంలోని సిఆర్ మార్టులో రైల్వేపోలీసులు నిర్వహించారు. ఈ సందర్భంగా సి.ఐ మాట్లాడుతూ ఉద్యోగులు బాధ్యతాయుతంగా పనిచేస్తే ప్రజల్లో ఎప్పటికీ స్థానం పొందవచ్చని అన్నారు. సామాన్య ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యలను పరిష్కరిస్తే దగ్గరవుతారన్నారు. ఆయన చేసిన సేవల గురించి ప్రశంసించారు. అనంతరం గజమాలతో సత్కరించి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో రైల్వే ఎస్సై బాలకృష్ణ, గూడూరు పట్టణ, రూరల్ ఎస్సైలు సుధాకర్, నరేష్, బాబి, జనార్ధన్‌రెడ్డి, పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

# ఈ తహశీల్దార్ భలే మంచోడు



గూడూరు తహశీల్దార్ వెంకటేశ్వర్లును సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు

పార్టీలకతీతంగా ఎలాంటి ఒత్తిళ్లకు తలొగ్గకుండా ప్రజలకు న్యాయం చేస్తున్న తహశీల్దార్ గోళ్ళ వెంకటేశ్వర్లు గూడూరు మండలంలో పనిచేయడం సంతోషకరమని కాంగ్రెస్‌పార్టీ గూడూరు పట్టణ అధ్యక్షుడు గోపాల్‌కృష్ణయాదవ్ అన్నారు. సోమవారం గూడూరు తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ వెంటేశ్వర్లును కాంగ్రెస్ పార్టీ నాయకులు పూలమాలలతో, శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా గోపాల్‌కృష్ణ యాదవ్ మాట్లాడుతూ ఎంతోమంది తహశీల్దార్‌లు గూడూరు మండలానికి వచ్చినా ప్రజల పక్షాన న్యాయం చేసిన వారు ఇంతవరకు రాలేదని, జిల్లాలో రెండో స్థానంలో ఉన్న గూడూరు మండలం తహశీల్దార్‌గా వచ్చిన వెంకటేశ్వర్లు తక్కువ కాలంలోనే భూ సమస్యలను చాకచక్యంగా పరిష్కరిస్తూ, అర్హులైనపేదలకు రేషన్‌కార్డులు, ఆధార్‌కార్డులు, ఇళ్ల స్థలాలు, పట్టాదారు పాసుపుస్తకాలను అందజేయడంలో విజయం సాధించారని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మైనార్టీ అధ్యక్షుడు జహంగీర్, గూడూరు పట్టణ ఉపాధ్యక్షుడు శిద్దయ్యనాయుడు, ఎస్సీ సెల్ నాయకుడు రవి, యూత్‌కాంగ్రెస్ నాయకుడు కిషోర్‌కుమార్, నాయకులు బీపీ యాదవ్, నయీం, ఎన్‌ఎస్‌యుఐ నాయకుడు అనిల్ తదితరులు పాల్గొన్నారు.



బ్రహ్మశ్రీ స్వయంపాకుల శ్రీనివాసులు
బాలాజీనగర్, నెల్లూరు

# రాశి - మీ వాసి

తేది. 4.8.2017 నుండి
తేది. 10.8.2017 వరకు

ఈ వారము మిధునంలో శుక్రుడు, కర్కాటకంలో రవికుజులు, సింహంలో బుధరాహువులు, కన్యలో గురువు, వృశ్చికంలో శని, కుంభంలో కేతువు, ధనుర్మకర కుంభ రాశులలో చంద్రుడు సంచరిస్తారు.

**పంచాంగము:**

తేది 4 శుక్రవారం వరలక్ష్మీవ్రతం.

తేది 7 సోమవారం శ్రావణ పూర్ణిమ మరియు రాత్రి గంట 10.48 నుండి 12.52లోగా పాక్షిక చంద్రగ్రహణం. ఈరోజు మధ్యాహ్నము గంట 1.0లోగా జంధ్యాలు ధరించడం, భోజనాబ్దికములు నిర్వహించుకొనవచ్చును. రక్షా బంధనము.

**ముహూర్తములు**

తేది 9 బుధవారము ఉదయం గంట 9.0 నుండి గంట 10.40లోగా కన్యా లగ్నమున వ్యాపార గృహారంభ వివాహములు. రాత్రి గంట 2.0 నుండి 4.0లోగా మిధునలగ్నమున గృహప్రవేశ, వివాహములు.

**శ్రావణమాస శుక్లపక్ష తిధులు**

| | | | |
|---|---|---|---|
| తేది. 4 | శుక్ర | ద్వాదశి | సా॥ గం.6.37వ॥ |
| తేది. 5 | శని | త్రయోదశి | రా॥ గం.8.20వ॥ |
| తేది. 6 | ఆది | చతుర్దశి | రా॥ గం.9.55వ॥ |
| తేది. 7 | సోమ | పూర్ణిమ | రా॥ గం.11.07వ॥ |

**శ్రావణమాస కృష్ణపక్ష తిధులు**

| | | | |
|---|---|---|---|
| తేది. 8 | మంగళ | పాడ్యమి | రా॥ గం.11.48వ॥ |
| తేది. 9 | బుధ | విదియ | రా॥ గం.12.3వ॥ |
| తేది. 10 | గురు | తదియ | రా॥ గం.11.39వ॥ |

## మేషం



అశ్వని, భరణి, కృతిక 1 పాదము

ఉద్యోగ నిర్వహణలో అధికారులతోను, పబ్లిక్‌తోను జాగ్రత్తగా మెలగండి. బిడ్డల విద్యా వివాహ విషయాలలో ప్రయత్నాలు ముమ్మరం చేస్తారు. రావలసిన బాకీలు నిలబడిపోతాయి. ఆరోగ్యం జాగ్రత్తగా కాపాడుకొనాలి. వస్తువులు, డబ్బు భద్రపరచుకొనడం చేయండి. ఆర్థికంగా బాగుండినా స్థిమితంగా ఉండలేరు. వృత్తి వ్యాపారాలలో ఆదాయం సామాన్యంగా ఉంటుంది.

## వృషభం



కృతిక 2, 3, 4 పాదాలు, రోహిణి, మృగశీర్ష1, 2పాదాలు

బంధుమిత్రులను కలుసుకొంటారు. ఆర్థిక లావాదేవీలు ప్రోత్సాహకరంగా సాగుతాయి. దూర ప్రయాణాలుంటాయి. ఉద్యోగులకు అధికారుల సహకారం బాగుంటుంది. గిట్టనివారి వల్ల మాటలు పడవలసి ఉంటుంది. ఆత్మీయులకు అనారోగ్య బాధలుంటాయి. ఇంటా బయటా పనులందు శ్రమ వుంటుంది. కాని చేపట్టిన పనులను సమర్ధవంతంగా నిర్వహిస్తారు.

## మిధునం



మృగశీర్ష 3,4 పాదాలు, ఆర్థ్ర, పునర్వసు 1, 2, 3పాదాలు

శుభకార్యాలు నిర్ణయం కావడం, బిడ్డల ఉన్నత విద్యపై శ్రద్ధ చూపడం జరుగుతుంది. యజమానులకు వర్కర్ల వల్ల ఇబ్బందులుంటాయి. ఉద్యోగులకు అధికారుల అనుకూలత ఉంటుంది. రావలసిన బాకీలు కొంత అందుతాయి. ఆరోగ్యం బాగుంటుంది. కొత్త పెట్టుబడులు, కొత్త వ్యాపారాల ప్రయత్నాలు జరుగుతాయి. ఆర్థిక లావాదేవీలు ప్రోత్సాహకరంగా ఉంటాయి.

## కర్కాటకం



పునర్వసు 4 పాదం, పుష్య, ఆశ్లేష

ఉద్యోగులకు గుర్తింపు గౌరవాలు బాగుంటాయి. ప్రయాణాలుంటాయి. కమిటి సమావేశాలలో ప్రముఖ పాత్ర వహిస్తారు. ఉన్న విద్యావకాశాలుంటాయి. ఇతరులకు ధన వస్తు మాట రూపంలో సహాయం చేస్తారు. కొత్త వ్యాపారాలకు, సంస్థలలో పెట్టుబడులకు అవకాశాలు దొరుకుతాయి. పట్టుదలతో అనుకున్న పనులు జరుపుకొంటారు. ఆర్థికంగా ఇబ్బందిరాదు.

## సింహం



మఖ, పుబ్బ, ఉత్తర 1పాదము

శుభకార్యాలలో పాల్గొంటారు. సాంకేతిక న్యాయ వైద్య రంగాల వారికి ఆర్థికావకాశాలు బాగుంటాయి. ప్రభుత్వ అనుమతులు, బ్యాంకు ఋణాలు పొందుతారు. ఒకటి రెండు పెద్ద అనవసర ఖర్చులుంటాయి. ఆరోగ్యం ఫరవాలేదు. ముఖ్యవిషయాలపై నిర్ణయాలు తీసుకొనలేక టెన్షన్ పడతారు. పెండింగ్ సమస్యలు పరిష్కారం కాగలవు. ఆర్థికంగా బాగుండి ఆదాయం పెరుగుతుంది.

## కన్య



ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1, 2 పాదాలు

దైవ, సామాజిక సేవా కార్యక్రమాలకు సహాయ పడతారు. కోర్టు వ్యవహారాలు వాయిదాపడతాయి. వ్యాపారాలు, అధికారులకు ప్రభుత్వ సంబంధమైన ఇబ్బందులు కలుగవచ్చు. ఆరోగ్యం బాగుంటుంది. ఉద్యోగములలో గాని, ఇతర కార్యక్రమాలలోగాని నిర్వహణ సామర్థ్యము బాగుంటుంది. చేతి డబ్బులు ఇతరుల పనులకు ఖర్చుపెట్టవలసి రావచ్చును.

## తుల



చిత్త 3, 4 పాదాలు, స్వాతి, విశాఖ 1, 2, 3 పాదాలు

వృత్తి వ్యాపారాలు సామాన్యంగా జరుగుతాయి. హామీలు, మధ్యవర్తిత్వాలకు పోవద్దు. పిల్లల వల్ల ఖర్చులు ఉంటాయి. ఇబ్బందులుండినా ధైర్యంగానే ఉంటారు. ఉద్యోగులకు విధి నిర్వహణ సాఫీగా సాగిపోతుంది. ఆర్థిక ఇబ్బందులుండవచ్చును. ఖర్చులు అధికంగా ఉంటాయి. అవసరాలకు ఋణం చేయవలసి వస్తుంది. వాహనాలు నడిపేవారు, కరెంటు పనుల వారు జాగ్రత్తగా ఉండాలి.

## వృశ్చికం



విశాఖ 4 పాదం, అనూరాధ, జ్యేష్ఠ

శుభకార్య ప్రయత్నాలలో అనుకూలత, దూర ప్రయాణాలుంటాయి. ఆరోగ్యం సంతృప్తికరం. అధికారులకు స్థానమార్పు, పెండింగ్ పనులు పరిష్కారం కాకపోవుట, ప్రభుత్వ అనుమతులలో ఆలస్యం జరుగుతుంది. కుటుంబ సౌఖ్యం బాగుంటుంది. అవసరాలకు డబ్బు సమకూర్చుకొంటారు. వృత్తి వ్యాపారాలలో విస్తరణ ప్రయత్నాలు జరుగకపోయినా ఆదాయ లోపం కలుగదు.

## ధనుస్సు



మూల, పూర్వాషాఢ, ఉ.షాఢ 1 పాదము

బిడ్డల అనారోగ్య బాధలు, ఉన్నత విద్యపై అనిశ్చితి ఉంటుంది. నిరుద్యోగులకు అవకాశాలు దొరకడం, దైవ సేవా కార్యములలో పాల్గొనడం, సహాయం చేయడం జరుగుతుంది. కుటుంబ సౌఖ్యం బాగుంటుంది. విలువైన వస్తువులను సమకూర్చుకుంటారు. ఆర్థిక ఒప్పందాలు జరుగును. వృత్తి జీవనం కలవారికి మంచి అవకాశాలు దొరకడం, వ్యాపారవర్గాలకు ఆదాయం బాగుంటుంది.


## మకరం



ఉ.షాఢ 2, 3, 4 పాదాలు, శ్రవణ, ధనిష్ఠ 1, 2 పాదాలు

విలువైన వస్తువులు సమకూర్చుకొనడం, శుభకార్యములను నిర్వహించడం చేస్తారు. బంధుమిత్రులను, ప్రముఖులను కలుసుకుంటారు. ఉద్యోగులకు అధికారుల నుండి అనుకూలత, అధికారులకు స్థానమార్పులుండును. రాజకీయ వర్గాలు సామరస్యంగా పోవడం మంచిది. ఆరోగ్యం బాగుంటుంది. ఉద్యోగావకాశాలు లభించగలవు. వ్యాపారాలు లాభసాటిగా జరుగుతాయి.

## కుంభం



ధనిష్ఠ 3, 4 పాదాలు, శతభిష, పూ.భాద్ర 1,2,3 పాదాలు.

విలువైన వస్తువులు సమకూరుతాయి. దైవసేవ, సామాజిక రంగాలకు సహాయం చేయడం చేస్తారు. స్థిరాస్తులు, షేర్ల మీద లాభాలుంటాయి. పనులు సానుకూలంగా జరిగినా టెన్షన్ ఉంటుంది. మీ ఆరోగ్యం ఫరవాలేదు. ఆర్థికావకాశాలు కలసివస్తాయి. అయితే కొంత డబ్బు ఖర్చుపెట్టవలసి వస్తుంది. బిడ్డలకు విద్యా ఉద్యోగ విషయాలలో అనుకూలత కలదు.

## మీనం



పూర్వాభాద్ర 4 పాదం, ఉ.భాద్ర, రేవతి

ఉద్యోగ ప్రయత్నాలలో అనుకూలత ఉంటుంది. శుభకార్యముల తేదీలను నిర్ణయం చేస్తారు. కుటుంబ సౌఖ్యం బాగుంటుంది. ఉద్యోగులకు అధికారుల సహకారం బాగుంటుంది. పొదుపు పెట్టుబడి విషయాలను ఆలోచిస్తారు. ఆత్మీయుల నుండి శుభవార్తలు వింటారు. ఆరోగ్యం బాగుంటుంది. అనుకున్న పనులు సవ్యంగా జరిగిపోతాయి.

# నంద్యాలలో నెల్లూరు లీడర్స్ షో!

శ్రీను గల్పిక

అది కర్నూలు జిల్లా నంద్యాల. ఎక్కడ చూసినా రోడ్ల పనులు జరుగుతున్నాయి. కమ్యూనిటి హాల్స్, దేవాలయాలు, మసీదులు, చర్చీలు కడుతున్నారు. సైడ్ కాలువలు నిర్మిస్తున్నారు. అమరావతి రాజధానిలో కంటే కూడా నంద్యాలలోనే అభివృద్ధి పనులు ఎక్కువగా జరుగుతున్నట్లుంది వాతావరణం. నంద్యాల ఉపఎన్నికల నేపథ్యంలో తెలుగుదేశం యంత్రాంగమంతా నంద్యాలలో దిగిపోయింది. రెండు వారాలుగా అక్కడే తిష్టేసి ఓట్ల కోసం ఇల్లిల్లు తిరుగుతున్న హైటెక్‌రత్న చంద్రబాబు రోడ్‌షో చేసుకుంటూ అప్పుడే బస్టాండ్ సెంటర్‌కు వచ్చాడు. అక్కడ గుమికూడివున్న జనాన్ని చూసి ఆయనకు ఎక్కడలేని హుషారొచ్చి మైకు తీసుకుని... తమ్ముళ్ళూ... నేనిచ్చిన రేషన్ బియ్యంతో అన్నం వండుకుంటున్నారు, నా హెరిటేజ్ షోరూమ్‌లో కూరగాయలు, పాలు తెచ్చుకుని కూరలు, పెరుగు చేసుకుంటున్నారు. నేను వేసిన రోడ్లపైన నడుస్తున్నారు. నేనిచ్చే పింఛన్ తీసుకుంటున్నారు. మీరు నాకు ఓట్లేయక ఇంకెవరికి వేస్తారు అని అన్నాడు. అంతలో అక్కడేవున్న ఓ మందుబాబు... సార్, మీరు మమ్మల్ని చిన్నచూపు చూస్తున్నారని ప్రశ్నిస్తున్నాడు. అతన్ని చూసి చంద్రబాబుకు చిర్రెత్తుకొచ్చింది. ఎవడ్రా నువ్వు? తాగి వచ్చావా? జగన్ డబ్బులిచ్చి తాగించి పంపాడా? నా నలభైఏళ్ల రాజకీయ జీవితంలో నీలాంటి వాళ్లను వందలమందిని చూసాను, ఆ జగన్ నిన్ను గొడవచేయమని పంపించాడు కదా అని అడిగాడు. అందుకు ఆ మందుబాబు... నాబోటి వాళ్లను వందలమందిని చూడ్డానికి 40ఏళ్ల సర్వీసు అవసరం లేద్సార్... నాలుగు నిముషాలలో నాలుగు బెల్టుషాపుల వద్దకు పోతే చాలు... వందలమంది కనపడతారు. మేం కూడా మీరిచ్చిన మందునే తాగుతున్నాం సార్, మా తాగుబోతుల ఓట్లడగరా? వాళ్లంటే మీకు లెక్కలేదా? రాష్ట్రంలో వున్న తాగుబోతులంతా ఒక్కసారి గాలివూదితే, ఆ గాలిలో మీరు కొట్టుకుపోతార్సార్... అని అరవసాగాడు. రేయ్, నేను ప్రజలను, ప్రతిపక్షాన్ని కంబైన్డ్‌గా టెన్షన్ పెడతాను, నువ్వేమో నన్నే టెన్షన్ పెడుతున్నావ్, ముందు వాణ్ణి పక్కకు లాగండిరా అని చంద్రబాబు సెక్యూరిటీని ఆదేశించి మూడ్ చెడిపోవడంతో గెస్ట్‌హౌస్‌కు పోయాడు. అక్కడ మంత్రులు దేవినేని ఉమ, కళా వెంకట్రావ్, పత్తిపాటి పుల్లారావులతో సమావేశమయ్యాడు. నంద్యాలలో ఎలక్షన్ టెన్షన్‌గా వుంది. ఇక్కడ కనుక ఓడిపోతే పరువుపోతుంది. అంతేకాదు, ఇక్కడనుండే మన డౌన్ ట్రెండ్ స్టార్టవుతుంది. ఇవి ఖచ్చితంగా గెలవాల్సిన ఎన్నికలు. గెలవడానికి ఏం చేయాలో చెప్పండని కోరాడు. అందుకు దేవినేని... సార్, ఎలక్షన్స్ చేయడంలో నెల్లూరువాళ్లు ఎక్స్‌పర్ట్స్. మొన్న కడప స్థానిక ఎమ్మెల్సీ ఎన్నికలప్పుడే నెల్లూరు నాయకుడు సోమిరెడ్డి టాలెంట్ చూసాను. నంద్యాలలో వాళ్లను దించండి, ఎదురుగా ఎట్లాంటి వాళ్లున్నా చీల్చి చెండాడుతారని సలహా ఇచ్చాడు. అందుకు చంద్రబాబు సరేనన్నాడు.

★★★★★

హైదరాబాద్‌లోని వైకాపా కార్యాలయం. వై.యస్.జగన్‌తో విజయసాయిరెడ్డి, ఆళ్ల రామకృష్ణారెడ్డి, అంబటి రాంబాబులు సమావేశమై వున్నారు. నంద్యాల ఎలక్షన్‌లో చంద్రబాబు నెల్లూరు నాయకులను దించుతున్నాడంట. నెల్లూరు నాయకులతో భలే డేంజర్. మనమేం చేద్దామని జగన్ అడిగాడు. దానికి విజయసాయిరెడ్డి... మా నెల్లూరు నాయకుల టాలెంట్ నాకు బాగా తెలుసు. ముల్లును ముల్లుతోనే తీయాలి. వజ్రాన్ని వజ్రంతోనే కోయాలి. కాబట్టి నెల్లూరు నుండి మనమూ మెరికల్లాంటి నాయకులను దించుదాము... తెలుగుదేశం వాళ్లకు చుక్కలు... చుక్కలు చూపిస్తాము అంటూ చిటికెలు వేస్తూ చెప్పాడు. అయితే ఇక ఆలస్యం ఎందుకు, వెంటనే ఫోన్‌చేసి దించు అని జగన్ చెప్పాడు. సరేనని విజయసాయిరెడ్డి లేచాడు.

★★★★★

నంద్యాల పట్టణంలో మెయిన్‌రోడ్డు... ఓవైపు నుండి తెలుగుదేశం అభ్యర్థి భూమా బ్రహ్మానందరెడ్డితో కలిసి నెల్లూరు లెజండ్స్ సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, పి.నారాయణ, బీద రవిచంద్ర, పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి ప్రచారం చేసుకుంటూ వస్తున్నారు. వారితో పాటు కర్నూలు జిల్లా నాయకులు అఖిలప్రియ, ఎస్.వి.మోహన్‌రెడ్డి, ఏ.వి.సుబ్బారెడ్డి, కె.ఇ.ప్రభాకర్ వంటి వారు కూడా వున్నారు. ఇంకోవైపు నుండి వైసిపి అభ్యర్థి శిల్పా మోహన్‌రెడ్డితో కలిసి నెల్లూరు లయన్స్ కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, కాకాణి గోవర్ధన్‌రెడ్డి, పి.అనిల్‌కుమార్‌యాదవ్, కిలివేటి సంజీవయ్యలు ప్రచారం చేసుకుంటూ వస్తున్నారు. కర్నూలుజిల్లా నాయకులు బుగ్గన రాజేంద్రరెడ్డి, ఐజయ్య, శ్రీదేవమ్మలు వారిని అనుసరిస్తున్నారు. ఇరు పార్టీల వారు కొద్దిసేపటికి దగ్గరగా వచ్చారు. సోమిరెడ్డి వైపు కాకాణి ఉద్రేకంగా చూసాడు... సోమిరెడ్డి కూడా కాకాణి వైపు ఉగ్రరూపంతో చూసాడు. అప్పుడే ఒకావిడ పచ్చిగడ్డి మోపును నెత్తిన పెట్టుకుని వాళ్ల మధ్యలోకి వచ్చింది... అంతే ఆ పచ్చగడ్డి నిలువునా మండిపోయింది. అది చూసి కర్నూలు జిల్లా నేతలు షాకయ్యారు. నెల్లూరు నాయకుల మధ్య కక్షలు ఇంతగా వుంటాయా అని ఆశ్చర్యపోయారు. మొదట కాకాణి మాటల యుద్ధం మొదలుపెట్టాడు. ఉట్టికెక్కలేనమ్మా, స్వర్గానికెగిరిందట... సర్వేపల్లిలో నా మీద గెలవలేనివాడివి, ఇక్కడకు ఏం పీకుదామని వచ్చావ్ అని సోమిరెడ్డిని ఉద్దేశించి అన్నాడు. అప్పుడు సోమిరెడ్డి... బుల్లెట్ చూడ్డానికి నాలాగే వుంటుంది... కాని దిగితే తెలుస్తుంది దాని పవరేంటో... తుపాకీని చూడు... కాని అందులోని బుల్లెట్‌ను చూడాలనుకోకు అని హెచ్చరించాడు. అప్పుడు కాకాణి... ఫ్లూటు జింక ముందు ఊదు, ఈ సింహం ముందు కాదు అని అన్నాడు. వెంటనే సోమిరెడ్డి... నేను గట్టిగా తొడ కొట్టానంటే ఆ సౌండ్‌కే మీరు నెల్లూరు పరుగెడుతారు... మీరా, నా ఎదురుగా నిలబడి మాట్లాడేది అని మాట్లాడాడు. అందుకు కాకాణి... కత్తులతో కాదు, కాళ్లకు వేసుకున్న సాక్స్‌తో మీకు చుక్కలు చూపించగలను... మాటలాపి ఇక పోండి అని అన్నాడు. అప్పుడు బీద రవిచంద్ర జోక్యం చేసుకుని... ఈ నంద్యాల సందుల్లో కాదు... రాత్రికి వూరి చివరనున్న డాబా వద్దకు రండి చూసుకుందాం... మీ ప్రతాపమూ, మా ప్రతాపమూ అని చెప్పాడు. అందుకు కాకాణి గ్యాంగ్ కూడా సరేననడంతో ఎవరిదారిన వాళ్లు వెళ్లారు. నెల్లూరు నాయకుల ఆగ్రహావేశాలను చూసి ఎప్పుడూ ఫ్యాక్షన్ మధ్య తిరిగే కర్నూలు జిల్లా నేతలకే దడపుట్టింది.

★★★★★

ఆరోజు రాత్రి... నంద్యాల ఊరి చివరన డాబా... నెల్లూరు నాయకుల మధ్య రక్తపాతం జరిగే అవకాశం వుందన్న సమాచారంతో ఆ డాబా పరిసరాలలో పెద్దఎత్తున పోలీసులను మోహరించారు. వీళ్ల గొడవల్లో మనమెందుకని చెప్పి టీడీపీ, వైసిపిలకు చెందిన కర్నూలు నాయకులు ఊపిరి బిగపట్టి డాబాకు దూరంగా వుండి అక్కడ ఏం జరుగుతుందోనని చెప్పి టెన్షన్‌తో చూడసాగారు. అప్పుడే డాబా వద్ద రెండు కార్లు ఆగాయి. ఒక కారులో సోమిరెడ్డి, నారాయణ, బీద, పోలంరెడ్డి దిగారు. ఇంకో కారులో కాకాణి, కోటంరెడ్డి, అనిల్, కిలివేటి సంజీవయ్యలు దిగారు. ఇక వీళ్లు తన్నుకోవడం ఖాయం అని కర్నూలు నాయకులు ఉత్కంఠగా ఎదురు చూస్తున్నారు. ఏ క్షణంలో అయినా గొడవ మొదలుకాగానే సర్దుబాటు చేయడానికి పోలీసులు అలర్ట్ అయ్యారు. నెల్లూరు టీడీపీ, వైసిపి నాయకులు ఒకొర్నొకరు చూసుకున్నారు. అందరూ దగ్గరగా వచ్చారు. సోమిరెడ్డి, కాకాణి, నారాయణ, అనిల్, బీద, కోటంరెడ్డి, పోలంరెడ్డి, సంజీవయ్యలు ఒకర్నొకరు ఆలింగనం చేసుకున్నారు. సరదాగా షేక్‌హ్యాండ్లిచ్చుకుని ఒకే టేబుల్ వద్ద కూర్చున్నారు. అందరూ కలిసి భోజనం ఆర్డర్ ఇచ్చారు. అప్పుడు అందరితో బీద... మనం నంద్యాల ఊరిలో వున్నంతసేపు శత్రువుల్లాగానే వుందాం... రాత్రయితే ఇలా ఎక్కడో చోట కలుద్దాం... కక్షలు, కార్పణ్యాలతో నరుక్కోవడానికి, చంపుకోవడానికి మనమేమన్నా కర్నూలు వాళ్లమా? మేధస్సుకు పుట్టినిల్లయిన నెల్లూరోళ్లం అని అన్నాడు. ఎలక్షన్ అయ్యేదాకా మనం పగలు అలా, రాత్రి ఇలా వుందామని కాకాణి చెప్పాడు. అందరూ అందుకు సరేనన్నారు. చాటుమాటుగా వారి మాటలు విన్న కర్నూలు జిల్లా నాయకులు అక్కడే స్పృహతప్పి పడిపోయారు.

# కల్యాణ వైభోగం...!



రాష్ట్ర వ్యవసాయ శాఖామంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి తోడల్లుడు దువ్వూరు శివకుమార్‌రెడ్డి - మమతల కుమారుడు **సిద్ధార్ధ్ - స్పందన** (స్వర్గీయ మాజీమంత్రి నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి మనుమరాలు, నల్లపరెడ్డి జగదీష్‌కుమార్‌రెడ్డి - రాధికల కుమార్తెల కల్యాణం జులై 30వ తేదీ నెల్లూరులోని విపిఆర్ కన్వెన్షన్ సెంటర్ నందు జరిగింది. వధూవరులకు 'లాయర్' శుభాకాంక్షలు.



జూలై 29వ తేదీన నెల్లూరు దర్గామిట్టలోని ఇపిఎస్ టవర్స్‌లో ఏర్పాటు చేసిన ఆదిత్య బిర్లా గ్రూప్ వారి "ప్యాంటలూమ్ షోరూమ్"ను ప్రారంభిస్తున్న ఇపిఎస్ కంపెనీ అధినేత యిమ్మడిశెట్టి పూల సత్యనారాయణ దంపతులు, పక్కన ఇ.సురేష్‌కుమార్, ప్యాంటలూన్ సిబ్బంది.

# గ(ర)బ్బర్‌సింగ్

(మొదటి పేజీ తరువాయి)

లేకుండా పోయింది. పార్టీని స్థాపించిన తొలి ఎన్నికల్లోనే తన పార్టీ తరపున అభ్యర్థులను నిలబెట్టలేదు. 2014 ఎన్నికల్లో బీజేపీకి, టీడీపీకి మద్దతు పలికాడు. కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో టీడీపీ అధికారంలోకి వచ్చాయి. ఏపికి ప్రత్యేకహోదాపై కేంద్రం మొండిచేయి చూపింది. రాష్ట్ర ప్రభుత్వం కూడా ప్రత్యేకహోదా కంటే ప్రత్యేక ప్యాకేజీయే చాలనుకుంది. ప్రత్యేకహోదాపై మూడుచోట్ల సభలు పెట్టిన పవన్‌కళ్యాణ్ కేంద్రంలోని బీజేపీని తిట్టాడేగాని ప్రత్యేకహోదా కోసం డిమాండ్ చేయకుండా ప్రత్యేకప్యాకేజీని ఎంతో అపురూపంగా అంగీకరించిన టీడీపీని పల్లెత్తుమాట అనలేదు. అమరావతి రాజధాని కోసం రైతుల నుండి బలవంతంగా భూములు తీసుకుంటున్నారని తెలిసి అప్పుడెప్పుడో రాజధాని గ్రామాల్లో ఆయన పర్యటించాడు. ప్రజలు తమ బాధలు చెప్పుకున్నారు. ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తానని చెప్పి వెళ్లాడు. ఆ తర్వాత అడ్రస్ లేదు. ఈమధ్య ప్రత్యేకహోదా సభలు పెట్టాడు. తలా తోకా లేదు.

ప్రశ్నిస్తానని ప్రజల్లోకి వచ్చిన వాళ్లు ప్రజాసమస్యలపై ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తుండాలి. మూడుకార్లు పంటలు పండే భూముల్లో రాజధాని ఎందుకని ప్రశ్నించాలి? మాగాణి పొలాల్లో ఎయిర్‌పోర్టులు, సెజ్‌లు ఏంటని ప్రశ్నించి వుండాలి? పుష్కరాల పేరుతో వేలకోట్లు దోపిడీ ఏంటని నిలదీసి వుండాలి. రాష్ట్రవ్యాప్తంగా ఎన్నో ప్రాజెక్టులు పెండింగ్‌లో వుండగా, పోలవరం పూర్తిచేస్తే ఎందుకూ పనికిరాని పట్టిసీమకు 1400కోట్లు ఎందుకని ప్రశ్నించి వుండాలి? రాజదాని పేరుతో రియల్‌ఎస్టేట్ వ్యాపారం ఎందుకని నిలదీసి అడిగి వుండాలి. ప్రత్యేకహోదాను ఎందుకు గట్టిగా అడగలేకపోతున్నారని నిలదీసుండాలి. 2014 ఎన్నికల్లో ఇచ్చిన కాపు రిజర్వేషన్ల హామీ ఏమైందని ప్రశ్నించి ఉండాలి.

కాని, ఈ మూడేళ్లలో చంద్రబాబును పవన్‌కళ్యాణ్ ఒక్క ప్రశ్న కూడా అడగలేదు, సరికదా, చంద్రబాబుతో భేటీకి ప్రత్యేక విమానంలో వెళ్లడం, చంద్రబాబును కలిసాక ఆయనను పొగడడం పవన్‌కు పరిపాటయ్యింది. చిన్నవాన కురిస్తే స్లాబంతా ఉరిసే రాజధాని భవనాలను 196 రోజుల్లో కట్టానని చంద్రబాబు చెప్పుకుంటే, ఇలాంటి అద్భుతాలు మీకే సాధ్యమంటూ పవన్ కితాబివ్వడం భలే కామెడీగా వుంది. ప్రజాసమస్యలపై పవన్‌కున్న నాలెడ్జ్‌కు ఇది అద్దంపడుతోంది. ఎవరన్నా ప్రజాసమస్యలు పరిష్కారమయ్యేంత వరకు ప్రభుత్వంతో పోరాడుతారు. పవన్ కళ్యాణ్ మాత్రం సమస్యలు పరిష్కారమయ్యేంత వరకు ప్రభుత్వంతో కలిసి పనిచేస్తాడట. అంటే ఇకముందంతా కూడా చంద్రబాబుతో కలిసే ఆయన పనిచేయనున్నాడని అర్ధమవుతోంది.

అక్టోబర్ నుండి ప్రత్యక్ష రాజకీయాల్లోకి వస్తానని పవన్ ప్రకటించుకున్నాడు. వచ్చి ఆయన పీకేదేముంది, చంద్రబాబు డైరెక్షన్‌లో యాక్షన్ చేయడం తప్పితే! ఆయన మాటలు, ఆయన చేష్టలు చూస్తుంటే ఇతను గబ్బర్‌సింగ్ కాదు చంద్రబాబు చేతిలో 'రబ్బర్‌సింగ్' అన్నది స్పష్టంగా అర్ధమవుతోంది.

సినిమాలలో పవన్‌కళ్యాణ్‌కు ఒక ఇమేజ్ వుంది. రాజకీయాల్లోకి వచ్చి చంద్రబాబు చేతిలో గన్‌లా మారితే అక్కడా, ఇక్కడా రెండు చోట్లా ఇమేజ్ దెబ్బతింటుంది. రాజకీయాల్లోకి వస్తే వాస్తవ పరిస్థితులను గుర్తించి ప్రజలపక్షాన నిలిచి ప్రభుత్వంతో పోరాడేటట్లన్నా వుండాలి, అలా చేయలేనప్పుడు గౌరవంగా సినిమాలే చేసుకుంటుంటే ఉన్న ఇమేజ్‌ను కాపాడుకోవడానికన్నా ఆస్కారముంటుంది.

# దెబ్బకు తా... బెట్టింగ్ ముఠా!

(మొదటి పేజీ తరువాయి)



**మద్యం...** ఒక మనిషిని శారీరకంగా, ఒక కుటుంబాన్ని మానసికంగా, ఆర్ధికంగా నాశనం చేస్తుంది.

**డ్రగ్స్...** ఒక మనిషిని నిలువునా చిత్తు చేస్తుంది.

**ఘర్షణ...** ఇద్దరు వ్యక్తుల మధ్య జరిగే ఘర్షణలో వాళ్లిద్దరే నష్టపోతారు.

**బెట్టింగ్స్...** అలా కాదు. ఇవి చాపక్రింద నీరులా, చైన్‌లింకు స్కీంలా ఒకరి నుండి ఒకరికి పాకుతుంది.

గత పదేళ్ల కాలంలో జిల్లా వ్యాప్తంగా మారుమూల ప్రాంతాలకు కూడా ఈ బెట్టింగ్ ఫోబియా విస్తరించి దీనిని నిర్వహించేవాళ్లు ఒక పెద్ద మాఫియాగా తయారయ్యారు. కోట్లలో బెట్టింగ్స్ జరగసాగాయి. జిల్లా నలుమూలలా బుకీలు, పంటర్లు ఏర్పడ్డారు. బుకీలకు కోట్ల రూపాయల రాబడి వచ్చింది. బెట్టింగ్ మాయలో పడి జిల్లా వ్యాప్తంగా ఎందరో వ్యాపారులు, ఉద్యోగులు, ఇతరులు కోట్లు పోగొట్టుకున్నారు. ఆస్తులను అమ్ముకున్నారు. కుటుంబాలను రోడ్డు పాల్జేసుకున్నారు. కుటుంబ సభ్యులతో కలిసి ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితి తెచ్చుకున్నారు. బెట్టింగ్స్ మాయలో పడి ఆస్తులు అమ్ముకుని ఆత్మహత్యలు చేసుకుంటున్న వారి సమాధుల మీద బుకీలు తమ సామ్రాజ్యాలను నిర్మించుకున్నారు. ఆఖరకు పోలీసులకు, రాజకీయ నాయకులకు లక్షలు దాటి కోట్ల రూపాయలలో మామూళ్లు ఇచ్చే స్థాయికి బుకీలు ఎదిగారు. ఈ జిల్లాకు ఎస్పీగా రామకృష్ణ రాకపోయి వుంటే, గత ఎస్పీ బదిలీ కాకుండా ఇక్కడే ఉండుంటే బెట్టింగ్స్ ముఠా పని మూడు పందేలు, ఆరు కోట్లు అన్నట్లుగా వుండేది. ఎన్నో కుటుంబాలు వీధులపాలై వుండేవి.

జిల్లా ఎస్పీగా రామకృష్ణ రావడంతోనే బెట్టింగ్స్ రాయుళ్ల గుండెల్లో బండపడింది. జిల్లాలో బెట్టింగ్స్‌కు ప్రధాన సూత్రధారిగా వున్న కృష్ణసింగ్‌ను అరెస్ట్ చేసి విచారించడంతోనే డొంకంతా కదిలింది. జిల్లా వ్యాప్తంగా వున్న బుకీలు, పంటర్లు ఎవరెవరన్నది పోలీసుల చేతికొచ్చింది. పోలీసు, రాజకీయ నాయకులలో ఎవరెవరికి ఎంతెంత ఇచ్చారన్నది తేలిపోయింది. బెట్టింగ్స్ ముఠాలతో సంబంధాలున్న వారందరినీ పోలీసులు ఇప్పటికే అదుపులోకి తీసుకుని విచారించారు. తెలుగుదేశం, వైసిపి నాయకులను కూడా వదల్లేదు. ఇంకా ఇద్దరు టీడీపీ నాయకులు దొరకాల్సివుంది.

## మీడియా ముందుకు బెట్టింగ్ మాఫియా...

జిల్లాలో సంచలనం రేపుతున్న బెట్టింగ్ మాఫియాను పోలీసులు 3వ తేదీ మీడియా ముందు ప్రవేశపెట్టారు. పోలీస్ పరేడ్‌గ్రౌండ్‌లోని ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్ హాల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ రామకృష్ణ మాట్లాడారు. బెట్టింగ్ మాఫియాకు సంబంధించి జిల్లాలో మొత్తం 115మందిని అరెస్ట్ చేసినట్లు వెల్లడించారు. వీరిలో 30మంది బుకీలు వున్నారని, వీరందరి నుండి 44,24,330 రూపాయల నగదు, 3 కార్లు, 27సవర్ల బంగారు ఆభరణాలు, 96 సెల్‌ఫోన్‌లు, 10ల్యాప్‌టాప్‌లు, 3కమ్యూనికేటర్లు, 2టీవీలను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. వీరిలో కొంతమంది వద్ద గంజాయి దొరికిందని, వారిపై గంజాయి చట్టం క్రింద కేసులు పెడుతున్నట్లు తెలిపారు. వివిధ ప్రాంతాల్లో విస్తృతంగా తనిఖీలు చేపట్టి వీరిని అరెస్ట్ చేసామని, పరారీలో వున్న 27మంది కోసం ఇంకా గాలిస్తున్నామని, బెట్టింగ్‌కు సహకరించిన వారిలో రాజకీయపార్టీల నాయకులు కూడా వున్నారని, వారిపైనా కేసులు నమోదు చేసామన్నారు. బెట్టింగ్ మాఫియాలో పోలీసుల పాత్రపై కూడా విచారణ జరుపుతున్నామని, ఇప్పటికే ఇద్దరు డిఎస్పీలు, ఇద్దరు సిఐలను విఆర్‌కు పంపించడం జరిగిందని చెప్పారు. బెట్టింగ్‌పై పూర్తి స్థాయిలో విచారణ జరిపి నిందితులందరి మీదా చర్యలు తీసుకుంటామని, ఎవరినీ వదిలే ప్రసక్తే లేదని ఆయన పేర్కొన్నారు.

# నంద్యాలలో... యుద్ధవాతావరణం!

(మొదటి పేజీ తరువాయి)

తర్వాత నంద్యాలకు ఉపఎన్నిక తప్పదని తెలిసి పక్క నియోజకవర్గాలకు చెందిన దాదాపు 15వేల ఓట్లు దొంగోట్లు చేర్పించారు. అయితే ఎన్నికల సంఘం జనవరి 1వ తేదీ నాటికి వున్న ఓటర్ల జాబితా ప్రకారమే ఎన్నికలు జరుగుతాయని ప్రకటించడంతో తెలుగుదేశం నాయకులు నీరుగారిపోయారు. సాధారణంగా సిట్టింగ్ ఎమ్మెల్యే చనిపోతే ఉపఎన్నికలలో సంబంధిత కుటుంబసభ్యులు పోటీ చేసినప్పుడు సానుభూతి ఓట్లు పడాలి. కాని, నంద్యాలలో ఆ పరిస్థితి కనిపించడం లేదు. భూమా నాగిరెడ్డి వైసిపిలోనే వుండుంటే సానుభూతి ఉండే దేమో? వైసిపిలో గెలిచి తెలుగుదేశంలో చేరడం వల్ల పెద్దగా సానుభూతి లేకుండాపోయింది. అదీగాక నంద్యాల నియోజకవర్గంలో భూమా ప్రభావం తక్కువ. కేవలం తెలుగుదేశం ఇక్కడ అధికారబలం అండతోనే గెలుపు కోసం పోరాడుతోంది. అటు తెలుగుదేశానికైనా, ఇటు వైసిపికైనా నంద్యాల ఉపఎన్నిక సెమీఫైనల్ లాంటిది. ఈ ఎన్నికల్లో గెలుపు ఎంత అవసరమో ఇరు పార్టీల నేతలకూ తెలుసు. కాబట్టే చంద్రబాబు ముఖ్యమంత్రి హోదాను వదిలేసి నంద్యాల రోడ్ల మీద తిరుగుతున్నాడు. ఎన్నికల నోటిఫికేషన్ వెలువడకముందు చంద్రబాబు నంద్యాలలో సుడిగాలిలా తిరిగాడు. ఓటర్లకు వరాలు గుప్పించడమే కాదు, నా పింఛన్‌లు, నా రేషన్ తీసుకుంటూ నాకెందుకు ఓట్లేయరంటూ బెదిరింపులకు దిగాడు. తెలుగుదేశం అభ్యర్థి భూమా బ్రహ్మానందరెడ్డి రాజకీయాలకు కొత్త. కాని వైసిపి అభ్యర్థి శిల్పా మోహన్‌రెడ్డి నంద్యాల ప్రజలకు సుపరిచితుడు. ప్రజల్లో పేరున్న నాయకుడు. నంద్యాల మున్సిపల్ కౌన్సిలర్ల మద్దతు బలంగా వుంది. పలువురు నాయకులు కూడా ఇటీవల వైసిపిలో చేరారు. తెలుగుదేశం ఎమ్మెల్సీ శిల్పా చక్రపాణిరెడ్డి కూడా ఆ పార్టీకి రాజీనామా చేసి వైసిపిలో చేరడం చంద్రబాబుకు షాకే! ఎన్నికల నోటిఫికేషన్ వచ్చాక వైసిపి అధినేత వై.యస్.జగన్మోహన్‌రెడ్డి ప్రచారంలోకి దిగడంతో నంద్యాల వైసిపి కేడర్‌లో ఎనలేని ఉత్సాహం వచ్చింది. నంద్యాల ఎన్నికలు వైసిపికి కూడా జీవన్మరణ సమస్య కావడంతో ఆ పార్టీ కూడా రాష్ట్రంలోని ప్రధాన నాయకులందరిని ఇక్కడ దించింది. ప్రచారంలో అధికార తెలుగుదేశంకు ప్రతిపక్ష వైకాపా ఏ మాత్రం తగ్గడం లేదు. తెలుగుదేశం మాత్రం ధనబలం, అధికారబలాన్ని దండిగా నమ్ముకుంది. ఇక ఎన్నికల నాటికి ఓటుకు ఎంత రేటు పలుకుతుందో చెప్పలేని పరిస్థితి నెలకొంది. చూడబోతే నంద్యాల మరో ఆర్.కె.నగర్ అయ్యేటట్లుంది. కేంద్ర బలగాలు, ఎన్నికల సంఘం నిఘాలో ఎన్నికలు నిర్వహిస్తే తప్పితే మామూలు పరిస్థితుల్లో అయితే ఇక్కడ ఎన్నికలు పద్ధతిగా జరిగేటట్లు లేవు. ఇక్కడ నెలకొంటున్న పరిస్థితులను చూస్తుంటే ఇక్కడ ఎన్నికలు కాకుండా ఇరువర్గాల మధ్య యుద్ధ సన్నాహాలు జరుగుతున్నట్లుంది.

## లయన్స్ ఆధ్వర్యంలో....

# ఎంఆర్ వాక్సిన్



కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో ఆగష్టు 1వ తేదీ నుండి 8వ తేదీ వరకు చేపట్టిన ఎంఆర్ వాక్సినేషన్ కార్యక్రమాన్ని లయన్స్ క్లబ్ ఆఫ్ నెల్లూరు ఆధ్వర్యంలో భారీఎత్తున నిర్వహిస్తున్నట్లు క్లబ్ రీజినల్ ఛైర్మెన్ బయ్యా శ్రీనివాసులు తెలిపారు. బుధవారం నెల్లూరులోని హోటల్ అతిథి గ్రాండ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రాణాంతకమైన మీజిల్స్(తట్టు), రుబెల్లా వ్యాధులు సోకకుండా నిరోధించేందుకు ఈ టీకాలు వేయడం జరుగుతుందన్నారు. 9 నెలల నుండి 15ఏళ్ల లోపు పిల్లలందరికీ ఈ టీకాలు వేయించి, ఈ వ్యాధులనుండి కాపాడు కోవాలని పిలుపునిచ్చారు. దేశవ్యాప్తంగా మీజిల్స్, రుబెల్లా వ్యాధులను అరికట్టేందుకు చేపట్టిన ఎంఆర్ వాక్సినేషన్ కార్యక్రమానికి ఇంటర్నేషనల్ అసోసియేషన్ ఆఫ్ లయన్స్ క్లబ్ వంద కోట్లు కేటాయించిందని చెప్పారు. జిల్లాలోని అన్ని పాఠశాలలు, ఆసుపత్రులు తిరిగి చిన్నారులందరికీ వ్యాక్సిన్‌లు వేయిస్తామన్నారు. ఈ సమావేశంలో క్లబ్ అధ్యక్షులు యిమ్మడిశెట్టి సురేష్‌కుమార్, జిల్లా కో-ఆర్డినేటర్ ఆంజనేయులు, లయన్స్ క్లబ్ ఆఫ్ పినాకిని అధ్యక్షులు విక్రమ్, ప్రగతి క్లబ్ అధ్యక్షులు పరాస్‌మల్ జైన్, ప్రతిభ క్లబ్ అధ్యక్షులు శ్రీధర్, సేవాప్రియ అధ్యక్షురాలు లహరి, ప్రియదర్శిని క్లబ్ అధ్యక్షురాలు శైలజ, లియో క్లబ్ అధ్యక్షులు జి.శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## బిఎస్ఎన్ఎల్ కొత్త ప్లాన్లు

బిఎస్ఎన్ఎల్ కొత్త ఆఫర్లు, ప్లాన్లు ప్రకటించనున్నట్లు పిజిఎం టిడిఎం రవిబాబు పేర్కొన్నారు. మంగళవారం నెల్లూరు బిఎస్ఎన్ఎల్ కార్యాలయంలో విలేకర్లతో రవిబాబు మాట్లాడుతూ రూ.66లతో కొత్త కనెక్షన్ తీసుకున్నవారికి అన్‌లిమిటెడ్ కాల్స్, నెట్ సౌకర్యం, ఎస్‌టివి 444, 333, 349 తదితర ప్లాన్స్‌ను, రీ-కనెక్షన్ మేళా నిర్వహించి బకాయిలు ఉన్నవారికి 10 నుంచి 15శాతం వరకు తగ్గింపు, ఎంసెట్, నీట్ అర్హత సాధించిన విద్యార్థులకు రూ.49కే 3జీ నెట్, టాక్‌టైం ఆఫర్ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు.

# మైమరపించిన మహమ్మద్ రఫి మ్యూజికల్ నైట్



నెల్లూరులోని మహమ్మద్ రఫి కల్చరల్ అకాడమి అధ్యక్షులు జాకీర్‌హుస్సేన్ ఆధ్వర్యంలో ఆదివారం నెల్లూరు మినీబైపాస్ రోడ్డులోని అనిల్ గార్డెన్స్‌లో నిర్వహించిన 'యాదే రఫి - 2017' మ్యూజికల్ నైట్ ఉర్రూతలూగించింది. ప్రముఖ గాయకులు ఎహ్‌తెషామ్, సిమ్రాన్, శేఖర్, నందిని, గౌస్‌బాష, మహమ్మద్ అస్లం, గౌస్ మహ్మద్, సుజాత, శిరీష, ఖయ్యామ్‌లు ఆలపించిన పాటలు ఆహూతులను మంత్ర ముగ్దులను చేసాయి. పాటలకు తగ్గట్టుగా యువత హావభావాలతో నృత్యాలు చేసి అలరించారు. తొలుత టీవీ నటుడు జాదూగర్ శ్రీనివాస్ నిర్వహించిన ఇంద్ర జాల ప్రదర్శన అందరి ప్రశంసలందు కుంది. ఈ సందర్భంగా నుడా డైరెక్టర్ షేక్ ఖాజావలికి యాదేరఫి-2017 లైఫ్ టైం అవార్డును ప్రముఖదాత వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, నగర మేయర్ అబ్దుల్ అజీజ్, టిడిపి నగర నియోకవర్గం ఇన్‌ఛార్జ్ ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి, డిప్యూటి మేయర్ ముక్కాల ద్వారకానాథ్, కార్పొరేటర్ ఆనం రంగమయూర్‌రెడ్డిలు ప్రదానం చేశారు.

## ఆధ్యాత్మిక గురువు.. స్వామి అమరానంద కన్నుమూత

ఎన్నో సంవత్సరాలుగా మండలకేంద్రమైన సంగంలో ఆశ్రమం నిర్మించుకుని ఆధ్మాత్మిక బోధనలు చేస్తున్న ప్రముఖ ఆధ్యాత్మిక గురువు స్వామి అమరానంద గత నెల 27వ తేది అర్ధరాత్రి పరమపదించారు. 28న ఆయన పార్థివదేహానికి ఆయన శిష్యులు అంతిమ సంస్కారాలు నిర్వహించారు. పెద్దసంఖ్యలో శిష్యులు విచ్చేసి ఆయన పార్థివదేహాన్ని సందర్శించి కన్నీరు మున్నీరయ్యారు. గత కొన్ని రోజులుగా ఆయన అస్వస్తతకు గురయ్యారు. నెల్లూరులోని ఒక ప్రముఖ వైద్యశాలలో చికిత్సపొందుతూ అంతిమశ్వాస విడిచారు. సుమారు 122 సంవత్సరాలు జీవించి ఎందరో జిజ్ఞాసువులకు ఆధ్మాత్మికంగా మార్గదర్శనం చేసిన మహనీయులాయన. తూర్పుగోదావరిజిల్లా చొప్ప వరం గ్రామం ఆయన స్వస్థలం. హిమాలయాలలోని ఒక ప్రఖ్యాతమైన సాధుసంఘంలో గురువును ఆశ్రయించి ఆధ్మాత్మిక సాధన చేసి, ఆ తర్వాత ఆయన నెల్లూరుజిల్లాకు విచ్చేశారు. సంగంలో ఆశ్రమాన్ని నిర్మించుకుని ఎంతోమంది శిష్యులకు ఆధ్యాత్మిక బోధనలు చేశారు. ఆధ్యాత్మిక గురువుగా జాతీయస్థాయిలో పేరుపొందిన ఆయనకు వేలాదిమంది శిష్యులున్నారు. స్వామీ అమరానంద మృతితో భక్తలోకం ఒక ప్రముఖ ఆధ్యాత్మిక గురువును కోల్పోయిందని, ఆయన మృతి తీరని లోటని శిష్యులు ఎంతో ఆవేదన చెందారు. స్వామి అమరానంద మృతిచెందారన్న సమాచారం తెలుసుకున్న ఆయన శిష్యులు నెల్లూరు నుంచే కాక అనేక ప్రాంతాల నుంచి సంగం ఆశ్రమానికి వచ్చి తమ గురువును కడసారి సందర్శించుకుని కన్నీటి నివాళులర్పించారు.

## రిజిస్ట్రార్ కార్యాలయాల్లో రద్దీ

ఆగస్టు నెల 1వ తేదీ నుండి రిజిస్ట్రేషన్ ధరలు పెరగడంతో గత నెల 31వ తేదీ సోమవారం నెల్లూరులోని ప్రధాన రిజిస్ట్రార్ కార్యాలయం స్టోన్‌హౌస్‌పేట, బుజబుజనెల్లూరు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలు కిక్కిరిసాయి. స్థలాలు, భూములు, కట్టడాల విలువలు భారీగా పెరగనుండడంతో అధికసంఖ్యలో ప్రజలు రిజిస్ట్రార్ కార్యాలయాలకు చేరుకున్నారు. నెల్లూరుజిల్లాలోని 9సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఇదే పరిస్థితి నెలకొంది.




నెల్లూరుజిల్లా శ్రీహరికోటలోని షార్ సెంటర్ నుండి నింగిలోకి రాకెట్లు ఎగురుతుంటాయి. ఆ రాకెట్లకు ఎగరడానికి ఒక లాంచ్ ప్యాడ్ ఉంటుంది. కాని నెల్లూరుజిల్లా వెంకటాచలం మండలం చవటపాలెం నుండి ఎటువంటి లాంచ్‌ప్యాడ్ లేకుండానే ఒక రాకెట్ ఎగిరి సాధారణ కార్యకర్త స్థాయి నుండి భారత ఉపరాష్ట్రపతి స్థాయికి దూసుకుపోయింది. ఆ రాకెట్ పేరే ముప్పవరపు వెంకయ్యనాయుడు.



# స్ఫూర్తిదాయక ప్రయాణం!

## • వెంకయ్య ఆత్మీయ అభినందన సభకు భారీ సన్నాహాలు



విలేకరుల సమావేశంలో 'మన వెంకయ్యకు ఆత్మీయ అభినందన' సభకు సంబంధించిన వివరాలను వెల్లడిస్తున్న నిర్వాహక కమిటి సభ్యులు

నెల్లూరుజిల్లా రాజకీయ చరిత్రలో మనకు చాలాగొప్పగా కనిపించే నాయకులు బెజవాడ గోపాలరెడ్డి, పుచ్చలపల్లి సుందరయ్యలు. అయితే వారికి కూడా సాధ్యం కానటువంటి అత్యున్నత స్థానాన్ని అలంకరించబోతున్న తొలి నెల్లూరీయుడు మన వెంకయ్యనాయుడు.

ఏబివిపి కార్యకర్తగా, విద్యార్థి సంఘం నాయకుడిగా, ఆరెస్సెస్ సేవకుడిగా, జనసంఘ్ నేతగా, శాసనసభ్యుడిగా, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా, జాతీయ ప్రధాన కార్యదర్శిగా, పార్టీ జాతీయ అధ్యక్షుడిగా, రాజ్యసభ సభ్యుడిగా, కేంద్రమంత్రిగా... ఆయన చూడని పదవులు లేవు... ఆయన ఎరుగని రాజకీయ కోణాలు లేవు. ఎన్ని పదవులు అనుభవించినా ఆయనకు సంతృప్తినిచ్చే పదవి మొదట భారతీయుడు. ఆ తర్వాత నెల్లూరీయుడు. పుట్టినగడ్డపై అంతటి మమకారం ఆయనకు. దేశంలో ఆయన తిరగని రాష్ట్రం, ఆయన కాలు మోపని ప్రాంతం లేదు. ఎక్కడ ప్రసంగిస్తున్నా, ఆయన ప్రసంగంలో 'నెల్లూరు' అనే పదం రాకుండా వుండదు. నెల్లూరుకు ఆయన ఏం చేసాడో అందరికీ తెలిసిందే! చేసిన అభివృద్ధి ఒకెత్తైతే... నెల్లూరును దేశమంతా తెలిసేలా చేసింది కూడా ఆయనే! నెల్లూరుజిల్లాను ఇంతగా ప్రేమించే నాయకుడు ఇప్పుడు ఉపరాష్ట్రపతి కాబోతున్నాడు. 5వ తేదీ ఉపరాష్ట్రపతి ఎన్నిక జరుగుతుంది. ఆ ఎన్నికలో ఆయన గెలుపు లాంఛనమే! ఈ నెల 11వ తేదీ ఉపరాష్ట్రపతిగా ఆయన ప్రమాణస్వీకారం చేస్తారు. ఈ ప్రమాణస్వీకారానికి ముందే తన నెల్లూరుపై అడుగుపెట్టాలని, ఆత్మీయులు, అభిమానులు, ఆప్తులతో కలిసి మాట్లాడాలని ఆయన మనసు పరితపించింది. దీనికోసమే ఆయన 7వ తేదీ ఉదయం తిరుమలలో తన ఇష్టదైవం వెంకన్న దర్శనం చేసుకుని మధ్యాహ్నం నెల్లూరుకు చేరుకోనున్నారు. మధ్యాహ్నం 3.30 గంటలకు నెల్లూరులోని విఆర్‌సి మైదానంలో వెంకయ్యనాయుడు ఆత్మీయ అభినందన సభకు భారీ సన్నాహాలు జరుగుతున్నాయి. ప్రముఖదాత వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, మంత్రులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, పి.నారాయణ, రత్నం విద్యాసంస్థల అధినేత కె.వి.రత్నం, నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, బీజేపీ నాయకులు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి, జమీన్‌రైతు సంపాదకులు నెల్లూరు డోలేంద్రప్రసాద్, అపస్మా నాయకులు బి.మనోహర్‌రెడ్డి, 'లాయర్' వారపత్రిక సంపాదకులు తుంగా శివప్రభాత్‌రెడ్డి, కృష్ణచైతన్య విద్యాసంస్థల డైరెక్టర్ పి.చంద్రశేఖర్‌రెడ్డిలు సభ్యులుగా వున్న కమిటీ ఆధ్వర్యంలో మన వెంకయ్యకు ఆత్మీయ అభినందన సభ ఏర్పాట్లు జరుగుతున్నాయి. జిల్లాలోని అన్ని విద్యాసంస్థల విద్యార్థులు, మేధావులు, ఆయా రంగాల ప్రముఖులతో పాటు అన్ని పార్టీల నాయకులు, పది నియోజకవర్గాలలో వున్న వెంకయ్య అభిమానులు, ఆత్మీయులు ఈ సభకు తరలివస్తున్నారు. వెంకయ్య మీదున్న అభిమానంతో ప్రముఖ సినీ నేపథ్య గాయకుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యంతో పాటు చెన్నై, బెంగుళూరు, హైదరాబాద్, వైజాగ్, విజయవాడ వంటి నగరాలలో, ఇతర రాష్ట్రాలలో స్థిరపడిన నెల్లూరీయులందరు కూడా వెంకయ్య ఆత్మీయ అభినందన సభకు ఎంతో అభిమానంతో విచ్చేస్తున్నారు.

నెల్లూరుజిల్లా నుండి ఉపరాష్ట్రపతి స్థాయికి ఎదిగిన మొదటి నాయకుడు వెంకయ్యనాయుడు. ఇక్కడ మనం గర్వించాల్సింది, స్ఫూర్తిగా తీసుకోవాల్సింది ఆయన ఎదిగిన వైనాన్ని చూసి. ఆయన పెద్దపేరున్న రాజకీయ కుటుంబంలో జన్మించి ఆ స్థాయికి చేరుకోలేదు. ఒక సామాన్య పేద కుటుంబంలో పుట్టి, రాజకీయాలలో పాయింట్ వన్‌పర్సంట్ కూడా క్రమశిక్షణ తప్పకుండా ఒకే సిద్ధాంతాన్ని ఆచరించి దేశ అత్యున్నత స్థానానికి ఎదిగిన నాయకుడు వెంకయ్య. మన పిల్లలకు ఆయన జీవితాన్ని, ఆయన ఆచరించిన సిద్ధాంతాన్ని ఆదర్శప్రాయంగా చూపాలి. ఇది ఒక వ్యక్తికి జరిగే అభినందన కాదు, ఒక పదవికి జరిగే సత్కారం కాదు, క్రమశిక్షణాయుత జీవితానికి, సిద్ధాంత నిబద్ధతకు జరిగే సత్కారం. మన నెల్లూరీయుడు సాధించిన ఔన్నత్యానికి, ఆయన చూపిన ఆదర్శానికి సన్మానం. కాబట్టి నెల్లూరీయులందరు వెంకయ్య ఆత్మీయ సభకు హాజరై ఆయనను నిండు మనసుతో దీవించాలని కమిటీ సభ్యులు కోరుతున్నారు.




అసామాన్య నాయకా!...

అందుకో...

మా అభినందనలు

అప్రతిహతంగా ఎదిగిన
మహోన్నత శిఖరం మీరు



ఉవ్వెత్తున ఎగిసిన
ప్రతిభా కెరటం మీరు



నెల్లూరు ఖ్యాతిని విశ్వవ్యాప్తం చేసిన
అసమాన ప్రజ్ఞాశీలి మీరు

లేరెవ్వరు మీకు పోటీ
మీకు మీరే సాటి!

మీ స్ఫూర్తి... ఆదర్శనీయం
మీ కీర్తి... అజరామరం



భారతదేశ 15వ ఉపరాష్ట్రపతిగా ఎన్నికై
తొలిసారిగా నెల్లూరుకు విచ్చేస్తున్న
శ్రీ ముప్పవరపు వెంకయ్యనాయుడు గారికి

అభివందనాలతో... K.V. RATNAM | K. VENUGOPAL | Dr. K. KRISHNA KISHORE

RATNAM
GROUP OF EDUCATIONAL INSTITUTIONS
ANDHRA PRADESH


Edited, Published, Printed & Owned by THUNGA SIVAPRABHATH REDDY, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at Roopa Graphics, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323485. Editor-THUNGA SIVAPRABHATH REDDY, Executive Editor-G.SREENIVASULU REDDY. e-mail: roopagroup@yahoo.com